# రావూరి భరద్వాజ
# సశేషం (పెద్దకథ)

సూత్రధారుడు : మరణం ప్రకృతిః శరీరిణాం, వికృతిర్జీవిత ముచ్యతే బుధైః
క్షణమప్యవతిష్ఠతే శ్వసన్, యదిజన్తుర్నను లాభవానసౌ.
[కాళిదాసుని 'రఘువంశం' నుండి]

( శరీరధారులకు మరణ మనేది సహజం. జీవించడ మనేది అసహజం. అందుచేత ఎవరైనా క్షణ కాలంపాటు వూపిరి తీసుకొన్నారంటే, ఎంతో లాభం సంపాదించామనే అనుకోవాలి. )

నటి : ఆర్యా !

సూత్ర : నీ కోసమే ఎదురు చూస్తున్నాను.

నటి : వచ్చాను. చెప్పండి. ఈ 'నాటకం' పేరేమిటి? ఎవరు రాశారు ? పాత్రల వివరాలేమిటి ?

సూత్ర : అస లిది నాటకమే కాదు !

నటి : అంటే — మన అవసరమే లేదన్న మాట ! అవసరం లేని చోటుకు అత్యవసరంగా మన మెందు కొచ్చినట్లు ?

సూత్ర : ఇంకోరకంగా చెప్పాలంటే ఇది 'నాటకం' గనక ! మరీ ఖచ్చితంగా చెప్పాలంటే ఇదే అసలైన, సిసలైన 'నాటకం' గనక !

నటి : దీని పేరు ?

సూత్ర : "అ (న) ంతం", లేదా "సశేషం", లేదా "అసతోమా సద్గమయ", కాదూ కూడదని నువ్వంటే "మృత్యోర్మా అమృతం గమయ."

నటి : ఇంకేం లేవా?

సూత్ర : లేకేం ? ఉన్నాయి. ఇవేవీ తమకు నచ్చనప్పుడు, నా సంచీలోంచి ఆ మిగిలిన వాటినీ బయటికి తీస్తాను. ఇన్నిటికీ ఈ పేరు నీకు నచ్చిందో లేదో చెప్పావుగాదేం?

నటి : ముందు 'నాటకం'చూడనీండి. చూశాక ఏ పేరు నప్పిందో చెబుతాను. ఏ పేరూ నప్పక పోతే, ఆ సంగతీ చెబుతాను. ఇప్పటికే ఆలస్యమయి పోయింది. ఇక ప్రదర్శనను ప్రారంభించండి. అలా ప్రారంభించడానికి ముందు పాత్రలను పరిచయం చేయండి.

సూత్ర : నీతో వచ్చిన చిక్కే ఇది! అస లిది నాటకమే కాదు. నాటకీయత ఉన్న కథ. ఈ ప్రక్రియలో క్కూడా మనం ప్రవేశిస్తే ఎలా ఉంటుందో చూదామన్న సరదాకొద్దీ నిన్ను కూడా తీసుకొచ్చాను.

నటి : కొత్త ప్రయోగమా?. . . ఏమిటి ? అటుకేసి చూస్తున్నారు? . . . మిమ్మల్నే !. . . . మాట్లాడరేం ? . . .

సూత్ర : ఇష్ !

నటి : ఎవరితో మాట్లాడుతున్నారండీ?

సూత్ర : రచయితతో – నువ్వడిగిన ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలా— అని రచయితను సంప్రదిస్తున్నాను.

నటి : ఏమన్నాడు?

సూత్ర : ఇది నూతన ప్రయోగమో, కాదో తనకూ తెలియదన్నాడు. ఇదివర కెవ్వరూ ఇలాంటి పనిచేయకపోతే ఇదే ప్రారంభమనుకోమన్నాడు. చేసే గనక ఉంటే, ఒక సన్మార్గగామినని మాత్రమే అనుకోమన్నాడు...ఏం? నిట్టూర్చావేం?

నటి : ప్రతిదానికీ నేను కారణం చెప్పను. అదేదో నిడివి మీద మనవి చేసుకొంటాను గానీ— మరి పాత్రలనన్నా పరిచయం చేస్తారా?

సూత్ర : భేషుగ్గా ! కథా నాయకుని పేరు అమృతమూర్తి. అతని భార్య పేరు ఆశ.

నటి మిగిలిన పాత్రల వివరాలు—క్రమంగా నేనే తెలుసుకొంటాను గానీ—ఒక సంగతి చెప్పండి! ఇది సుఖాంతమా? విషాదాంతమా ?

సూత్ర : చిత్ర మేమిటంటే — ఒకరకంగా ఇది సుఖాంతం, మరోరకంగా విషాదాంతం ! ఈ సుఖ దుఃఖాలు రెండూ ఒకేసారి, ఒకేచోట కలిసి మెలిసి, కలగలిసిపోయి ఉండడం . . . అలా నవ్వావేం ?

నటి : ఇది చిత్రంగాలేదూ! ఇదేమో—పూర్తి కథాకాదు, అలాగని నాటకమూ కాదు, సుఖాంతమూ కాదు, దుఃఖాంతమూ కాదు.

సూత్ర : అవును—కానేకాదు.

నటి : ఏమీ కాని దానిలోకి 'తగుదునమ్మా' అంటూ ప్రవేశించడం నా కొట్టే ఇష్టంలేదు. నేను వెళిపోతున్నాను.

సూత్ర : గడుసుదానివే ! అటునుంచి కథా నాయకు డొస్తున్నాడు. నువ్వన్నట్టు మనం కాస్సేపు వెళ్ళిపోవడమే మంచిది !

● ● ● ●

అహ్లాదకరమైన ఆ రోజు ఉదయం అమృతమూర్తి హఠాత్తుగా కూలిపోయాడు. అంతక్రితం దాకా అతను హాయిగానే ఉన్నాడు. వారితోనూ, వీరితోనూ మాటాడుతూనే ఉన్నాడు. నిన్న సాయంత్రం తను బంజారా కొండలమీదికి వెళ్ళినప్పుడు అక్కడ రాళ్ళు కొడుతున్న లింగమయ్య చెప్పిన కబుర్లన్నీ జ్ఞాపకం చేసుకొని, శర్మతో చెబుతున్నాడు. ఆ రోజున చేయవలసిన పనులన్నింటినీ గుర్తు చేసుకొంటున్నాడు. చేసుకొంటూ చేసుకొంటూనే, గుండెమీద చేయి వేసుకొన్నాడు. చేయి వేసుకొంటూ వేసుకొంటూనే వాలిపోయాడు, కూలిపోయాడు.

ఆ తరువాత ఏమి జరిగిందీ అమృతమూర్తికి తెలీదు. సరదాగా మాటాడుతూ మాటాడుతూనే మాటాడ్డం మానేసినవాణ్ణి చూసి, మెరిసే కనులతో చూస్తూ చూస్తూనే, చూడడం మానేసినవాణ్ణి చూసి పద్మనాభరావు ఆశ్చర్యపోయాడు. గోవర్ధన్ ఆశ్చర్యపోయాడు. అరుణాచలం ఆశ్చర్యపోయాడు. చౌదరి ఆశ్చర్యపోయాడు. శాస్త్రి ఆశ్చర్యపోయాడు. ఈ అయిదుగురూ కలిసి నాలుగు దిక్కులా చూశారు. ఒక దిక్కున వారికి ఆస్పత్రి కనిపించింది. ముగ్గురూ సాయం పట్టి అమృతమూర్తిని ఆస్పత్రికి చేర్చారు.

మాటాడుతూ, మాటాడుతూనే వాలిపోయి, కూలిపోయిన అమృతమూర్తి దోవ పొడవునా విలవిల్లాడుతూనే ఉన్నాడు. గిలగిల్లాడుతూనే ఉన్నాడు. మూలుగుతూనే ఉన్నాడు. ముక్కుతూనే ఉన్నాడు.

( అయితే ఈ సంగతులేవీ అమృతమూర్తికి తెలియవు. )

అతన్ని చూస్తూనే "అరె!" అన్నాడు సత్యన్నారాయణరావు.

ఆయన డాక్టరు.

"అరెరె" అన్నాడు కుమార్.


ఈయనా డాక్టరే!

ఈ ఇద్దరు డాక్టర్లూ, మరో ఇద్దరు సిస్టర్లూ కాక మరో ఇద్దరు మిత్రులూ కలిసి అమృతమూర్తిని మంచంమీద పడుకోబెట్టారు. చొక్కా తీసేశారు. బనియను తీసేశారు. పంచెను వదులు చేశారు. మెడదాకా దుప్పటి కప్పారు. ఆ దుప్పటిలోంచి రెండు చేతుల్నీ వెలుపలికి తీశారు. ముందు ముందు అవసరమయితే—సూది మందు లివ్వాలి గనుక, అలా ఇచ్చేందుకు అప్పుడు నరం దొరక్కపోవచ్చు గనుక, ఇప్పుడే ఆ నరాన్ని పట్టుకోమన్నాడు డాక్టర్. అడివయ్య సెలైన్ సీసాలు సర్దుతున్నాడు. యాదయ్య స్టాండు పట్టుకొచ్చాడు. సావిత్రి, రత్న, సరస్వతి, పాప, గ్లోరి, కారోలిన్ చుట్టూ ముసురుకొన్నారు.

"గివ్ హిమ్ మార్ఫియా!" అన్నాడు సత్యన్నారాయణరావు కాస్త బిగ్గరగా.

ఆయన డాక్టరు. లోగడ అమృతమూర్తికి ఇలాంటి జబ్బే వచ్చినప్పుడు వైద్యం చేశాడు. అమృతమూర్తి శరీరతత్త్వం ఆయనకు క్షుణ్ణంగా తెలుసు.

'గివ్ హిమ్ మార్ఫియా' అన్నాడుగదా !




అదిన్నీ కాస్త బిగ్గరగానే అన్నాడుగదా! ఆ అనడంలో కాస్తంత ఆందోళన ఉంది. భయం ఉంది. ఆదుర్దా సైతం ఉంది. చెప్పొద్దూ—లోపల—పిసరంత అనుమానం కూడా ఉంది. ఇవన్నీ ఉన్నట్టు ఆయన అననూ లేదు, మరొకరు వినవూ లేదు. కానీ ఉన్నాయని భయంతో వణుకుతున్న ఆయన చేతివేళ్ళూ, దుఃఖంతో కదులుతున్న ఆయన తడికళ్ళూ చెబుతున్నాయి.

"ఫర్వాలేదా?" అన్నాడు శాస్త్రి.

"ఇబ్బందేం లేదుగదా?" అన్నాడు అరుణాచలం.

"శానా మంచి మనిసి—సూడండి, సార్" అన్నాడు గోవర్ధన్.

సత్యన్నారాయణరావు నవ్వాడు. నిజాని కది నవ్వులాగా లేదు. చుట్టూ ఉన్న వారికి ధైర్యం చెప్పడంకోసం నవ్వినట్టుగా ఉంది. అల్లాగా నవ్వి, అమృతమూర్తివేపు చూశాడు. చూస్తూనే చిందర వందరగా ఉన్న అమృతమూర్తి జుట్టు సవరించాడు. తలకింది దిండు సవరించాడు. నెమ్మదిగా జారి పడుతున్న సెలైన్ వాటర్ చుక్కల్ని చూశాడు. అమృతమూర్తి గుండెమీద తిరగవేసిన నడిమి వేలితో తట్టాడు. స్టెతస్కోపుతో ఇంకోసారి పరీక్ష చేశాడు. గుండెగారు ఏం చెప్పారో, డాక్టరు గారు ఏం విన్నారో తెలీదుగానీ, ఆయనమాత్రం సన్నగా నిట్టూర్చాడు.

"ఫర్వాలేదు...ఇలాంటివాళ్ళు కాస్త జాగర్తగా ఉండాలి...ఆవేశపడడం, ఉద్రేకపడడం, ఆందోళన పడడం పనికిరావు...వాళ్ళ వాళ్ళకు కబురు చేశారా?... చేయండి మరి...ఏం లేదు...తోడుగా ఉండాలిగదా..." అన్నారు సత్యన్నారాయణరావుగారు కాస్త గార్డెడ్‌గా.

అరుణాచలం, శాస్త్రి, గోవర్ధన్ ఒకరి నొకరు చూసుకొన్నారు. చూసుకొన్నాక అమృతమూర్తిని—వూపిరి పీలుస్తున్న అమృతమూర్తిని—చూశారు. మళ్ళీ సాయంకాలం తా మొచ్చేవేళకు వూపిరి పీల్చే అమృతమూర్తిని చూడవలసి వస్తుందో, పీల్చని అమృతమూర్తిని చూడవలసి వస్తుందో వారు చెప్పుకోలేకపోయారు. అందుకనే—'అదే ఆఖరు చూపు'—అన్నట్టుగా చూశారు. చూసి—'ఐసీసీయు' నుండి బయటపడ్డారు.

(అయితే ఈ సంగతులేవీ అమృతమూర్తికి ఆ రాత్రి పొద్దుపోయిందాకా తెలియవు.)

అతను కళ్ళు విప్పి చూశాడు. మసగ్గా, మంచులోంచి చూస్తున్నట్టుగా ఉంది. తనెక్కడున్నదీ, ఎందుకున్నదీ చప్పున బోధపడలేదు.

చేయి తిమ్మిరెక్కినట్లుగా ఉంటే కదిలించ బోయాడు. నూటులు కదిలి, బాగా చురుకులు లేచాయి. కదలకుండానే తల తిప్పి, అందినంతమేరకూ చూశాడు. ఎదురుగా రెండు మంచాలు—ఆ మంచాల పక్కనే స్టాండులు, సెలైన్ బాటిల్స్—ఈ పక్కనా, ఆ పక్కనా అలాంటివే మంచాలూ, స్టాండులూ!

విషయం బాగానే బోధపడింది!

కాస్తో కూస్తో అనుమానం ఉంటే, నర్సును చూస్తూనే--అదీ కాస్తా తీరిపోయింది.

"ఎప్పుడొచ్చాను?" అన్నాడు అమృతమూర్తి నెమ్మదిగా.

'మాట్లాడకూడ' దన్నట్లుగా సిస్టర్ సైగ చేసింది.

కళ్ళనిండా కరుణను నింపుకొని మెల్లగా, అడుగులో అడుగు వేసుకొంటూ మంచందగ్గర కొచ్చింది సిస్టర్ గ్లోరి.

"ఉదయం వచ్చారు ... వచ్చినప్పటి కన్నా బాగా ఉన్నారు ... మీకు తప్పకుండా బాగవుతుంది. అవుతుందని డాక్టర్లు కూడా అన్నారు ..."

తన నమ్మకాన్నంతా మాటలలో నింపివేసి, మెల్లగా మాట్లాడుతున్నది సిస్టర్ గ్లోరి.


అమృతమూర్తి తల తిప్పి, ఆ పక్కకూ, ఈ పక్కకూ చూశాడు.

"ఎవరు కావాలి?"

"నాకోసం ఎవరొచ్చారు?" అన్నాడు.

"చాలామంది వచ్చారు. ఎవరో 'ఆశ' గారుట. ఇప్పటిదాకా ఇక్కడే ఉన్నారు. నో మాట లేదు. పలుకు లేదు. ఆఖరుకు కంటి వెంట నీరుకూడా రాలేదు. 'ఈవిడేం మనిషిరా, నాయనా!' అనుకొన్నాను. మిమ్మల్ని చూసీ, చూసీ, చూసీ— అలా చూస్తూ చూస్తూ, చూస్తూనే కళ్ళు మూసుకొని పడిపోయింది. ఆవిడ— అంత దుఃఖాన్ని కడుపులో దాచుకొన్నదని మేం అనుకోలేదు..." అన్నది గ్లోరి.

అమృతమూర్తి కళ్ళు నీటితో నిండిపోయాయి.




"నా మతి మండిపోనూ! అనగూడని వన్నీ అనేశాను ... ఇంద — ఆ— అనండి! నోరు తెరవండి. ఈ నాలుగు బిళ్ళలూ మింగండి! ఒక్క రెండు నిమిషాలు కళ్ళు మూసుకొని పడుకోండి. మగతగా, మత్తుగా కునుకు పడుతుంది."

అమృతమూర్తి నోరు తెరిచాడు.

పసుపు పచ్చగా ఉన్న నాలుగు చిన్న చిన్న బిళ్ళల్ని గొంతులో వేసి, కొద్ది కొద్దిగా నీరు పోసింది సిస్టర్ గ్లోరీ.

అమృతమూర్తి గుటక వేశాడు. కానీ కళ్ళు మూయలేదు. కన్నీరు తుడుస్తున్న నెపంతో రెండు కళ్ళూ ఓ నిముషం పాటు మూసింది గ్లోరీ. ఆ తరవాత దుప్పటిని సవరించింది. సెలైన్ బాటిల్‌ను సవరించింది. పక్కకు తిరిగి, కన్నీరు తుడుచుకొంది గ్లోరి!

• • • •

సూత్రధారి : ఎలా ఉంది?

నటి : ఎలాగో ఉంది!

సూత్రధారి : ఆ సంగతి చెప్పడానికా నన్నిలా లాక్కొచ్చావ్?

నటి : నే నేదో చెప్పడంకోసమని మిమ్మల్నిక్కడకు తీసుకు రాలేదు.

సూత్రధారి : పోనీ — నన్నేం చెప్పమంటావో— అదన్నా చెప్పరాదా?

నటి : కథానాయకుణ్ణి ఆస్పత్రిపాలు చేశారు. ఇంతవరకూ జరిగినదాన్నిబట్టి, అమృతమూర్తికి 'గుండెపోటు' వచ్చిందని గ్రహించాను.

సూత్రధారి : రక్షించావు! ఇంకేం గ్రహించావు?

నటి : రోగుల్ని నిద్రపుచ్చుతా రెందుకని?

సూత్రధారి : దాన్ని — నీకున్న అనుమాన మంటారుగానీ, నీవు గ్రహించడమనరు! నాకూ పూర్తిగా తెలీదు. ఈ అవసరానికి సరిపడినంత మాత్రం తెలుసు. గుండెపోటు రావడానికి చాలా కారణా లున్నాయి. అవన్నీ ఇక్కడ ఏకరువుపెట్టడం — అక్షరాలా అనవసరం! ఇక అవసరమేమిటంటే— రోగిని నిద్రపుచ్చడం. మెలకువగా ఉన్న రోగి, తీవ్రమైన బాధను అనుభవించాలి. ఆ బాధ అతనికి తెలియకుండా ఉండడంకోసం నిద్రపుచ్చుతారు. మెలకువగా ఉన్న రోగి, జబ్బుతో పోరాటం కొనసాగిస్తాడు. అతన్ని నిద్రపుచ్చడం ద్వారా — రోగంతో డాక్టర్లు పోరాడుతారు. సరిగ్గా ఇప్పుడా పనే జరిగింది.

నటి : అమృతమూర్తి ఇప్పుడు మెలకువగా ఉన్నాడా? సుషుప్తిలో ఉన్నాడా?

సూత్రధారి : నిదురకూ, మెలకువకూ మధ్యగల సరిహద్దుల్లో, సుషుప్తికీ, గాఢ సుషుప్తికీ మధ్యగల సరిహద్దుల్లో సంచరిస్తున్నాడు.

నటి : ఇది సుఖాంతమా? దుఃఖాంతమా?

సూత్రధారి : అదీ, ఇదీ రెండూను.

నటి : అమృతమూర్తి మనో ప్రపంచం ఎలా ఉందో చూడవచ్చునా?

సూత్రధారి : తప్పకుండా. కానీ — అదంతా అయోమయంగా ఉంటుంది. అడ్డదిడ్డంగా ఉంటుంది. అర్థరహితంగా ఉంటుంది. అప్పుడప్పుడు ఏవో కొన్ని అన్వయ సూత్రాలు కనబడినా, పూర్తిగా అవగాహన కావట్టే లెక్క. అనుచితంగా, అక్రమంగా, అననుకూలంగా, ఆశ్చర్యంగా, అబ్బురంగా, కొన్ని కొన్ని సందర్భాల్లో భయంకరంగా, జుగుప్సావహంగా, ఏహ్యంగా కూడా ఉంటుంది.

నటి : అయినా నా కభ్యంతరం లేదు.

సూత్రధారి : నిన్ను మెచ్చుకుంటూనే, మరో సంగతి మనవి చేసుకుంటున్నాను. ఇది రెండు రంగాలలో జరుగుతుంది. ఒకటి—'బహిరంగం'—రెండవది 'అంతరంగం' ఇంతవరకూ అయింది —బహిరంగం. ఇప్పటిది అంతరంగం — ఒక్కోసారి అంతరంగంలోనూ, బహిరంగంలోనూ ఒకే కాలంలో ఇది జరుగుతుంది ...నువ్వెంతవరకూ గ్రహించానన్నావ్?

నటి : పసుపు పచ్చని బిళ్ళలు గొంతులో వేసి, కాసిని నీరు పోసి, కన్నీరు తుడుస్తున్న నెపంతో, ఓ నిముషంపాటు అమృతమూర్తి కళ్ళు మూసి, నిశ్శబ్దంగా అసంటా వెళ్ళి, సిస్టర్ గ్లోరీ కన్నీరు తుడుచుకొన్నది.

సూత్రధారి : ఇది బహిరంగం!

నటి : ఆ సంగతీ చెప్పారు. ఇది చర్విత చర్వణం.

సూత్రధారి: అప్పుడప్పుడు, ఇలాంటప్పుడు ఈ చర్వితాలూ, చర్వణాలూ తప్పవుగాక తప్పవు!

నటి : చిత్తం!

సూత్రధారి : ఇహ చిత్తగించండి! తమరు చిత్తగించబోతున్నది అమృతమూర్తి అంతరంగమని మరోసారి మనవి చేసుకుంటూ పక్కకు తప్పుకొంటున్నాను.

• • • •

తడివేళ మీద పొడికాళ్ళు. నడవలో నడచే నడవ. అనంతాతకాశాన్నంతా ఆవరించిన, రంగు రంగుల కిరీటం. నిదురపోతున్నాయి పదాలు, సమాసాల చౌశితి బంధాలను విడవకుండానే! ఆగ్రహానికి— ఏయ్ — మాటలను విరచకు—'ఆగ్రహం' అని, నే నన్నది 'కోపం' అన్న అర్థంలోనే! 'దూరంగా ఉన్న గ్రహం' అని చెప్పడానికి, ఇంతకన్నా పసందైన మాటే నాకు దొరకదా?

చలికి గజగజలాడుతున్న ధాత్రి. చీకటి ఉక్కు పిడికిలిలో గిజగిజలాడుతున్న రాత్రి. దీపాల కొన నాలుకల మీంచి, పాదాలు జారిపోయిన అందాలపాట! మాదకతతో వూగుతూ, తూగుతున్న పాటల వర్ణంలోని పాట! అలసి నిదురపోతున్న శబ్దాలు ఆలోచనల్ని ఆలాపించడం లేదు. ఉభయ సంధ్యల మధ్య చిక్కడిపోయిన ఈ కాలశకలం పేరు పగలా? రాత్రా? మందిరాల మందారాల కపోతాల కపోలాల మీద కేలలు గంటున్న హిమాణువులు! మంచుతుప్పర కురుస్తున్నట్టూ, కురుస్తూ మెరుస్తున్నట్టూ, వెలుగుతూ, వెలుగుతూ మెలుగుతున్నట్టూ ఉన్నదేం? కెరటాలను పిలుస్తూ పిలుస్తూ, అసమయ అస్తమయాలు తరుముతున్నాయి.

బండలు అరుస్తున్నా యిప్పుడు. గుండెలు కరుస్తున్నా యిప్పుడు. గోడలు కదులుతున్నా యిప్పుడు. వోడలు ఆగిపోయా యిప్పుడు. కెరటానికి కోరలొచ్చా యిప్పుడు. కుటజానికి కొమ్ములొచ్చా యిప్పుడు. కాంతులుపలుకుతున్నాయిప్పుడు. శబ్దాలు వెలుగుతున్నా యిప్పుడు. రంగు కిరణాల దారాలు చిక్కుపడ్డా యిప్పుడు. ఆకుతోటల మధ్యన ఆడదాని మానభంగం జరిగిం దిప్పుడు. చిట్టడవి నట్టనడిమిన ఆర్తనాదం మొలుచు కొచ్చిందిప్పుడు. మందంగా, అందంగా కుందనం — పరిమళిస్తున్న దిప్పుడు. అడవితిరగబడిం దిప్పుడు. గాలి ఎర్రబడిం దిప్పుడు. ఎండ నల్ల బడిం దిప్పుడు. నేలచల్లబడిం దిప్పుడు. విరులు ఆవిరు లెత్తుతున్నా యిప్పుడు.

ఆలోచనల్లోంచి అగ్గిరవ్వలు మేలుకొంటున్నా యిప్పుడు. కొండవాగు కలవరిస్తున్న దిప్పుడు. బండరాళ్ళు కదులుతున్నా యిప్పుడు. అవసరం, కదలిక, ఆచరణ, హఠాత్తుగా అరెస్టయ్యాయిప్పుడు. ఆకలి ( ఛీ! పాడుది )ఆయువు పెంచుకొన్నదిప్పుడు. బాకు వీపును చీరేసిం దిప్పుడు. చాకు — పొట్టను చీల్చేసిం దిప్పుడు. గాజు పెంకు కొసాన సూర్య కిరణం పగిలిపోయిం దిప్పుడు. సానమీద స్నానం చేస్తున్న సరి కొత్త చురకత్తి నెత్తురుపాట పాడిం దిప్పుడు. మాటలు — మంటల్లో కాగి, సలసల లాడుతున్నా యిప్పుడు. చెరచబడిన పాటలు, దిసి మొలల్తో, తలకిందులుగా వేళ్ళాడుతున్నా యిప్పుడు. గాలిలో జేగురు రంగు తేలిపోతున్న దిప్పుడు. ఆస్త మయం నిండా విష వాయువు విస్తరించిపోయిం దిప్పుడు.

రసాలు — తొమ్మిదనేనా అంటారు?

ఈ రసాలకు రంగు లద్దితే ఎలా ఉంటుంది? ఏడు మవులిక వర్ణాలలా, ఏడు లక్షల రంగులయినట్లు గానే, తొమ్మిది మవులిక రసాలూ, తొమ్మిది లక్షల రసా లవుతాయా? అసత్యాల వలువల్ని విప్పేసిన ఆర్తనాదం రహస్యమేమిటి? పావలా పరక డబ్బుల కోసం, పక్క మీద పరుచుకొన్న యువ్వనం రహస్య మేమిటి?

అంతా ఒక ప్రశ్నన్!
అన్నీ ఒక ప్రశ్నన్! !

కాలాన్ని అధిరోహించి, ఆకాశాన్ని ఆక్రమిస్తాను.

కన్నీటి కాసారంలో, ఒంటికాలి దొంగ కొంగ. లక్ష్యం — సలక్షణంగా దగ్గర కొచ్చింది. గళాలు సవరించుకొంటున్నాయి విగళాలు. అంకెలు—రంకె వేస్తున్నాయి. గొంతుకు జీరపోయిన మంజీరాలు మవునంగా రోదిస్తున్నాయి. కోమలాంగుల సుతి మెత్తని తొడల స్పర్శకోసం గిలగిల్లాడిపోతున్నాయి, ఈత కొలనులోని నీళ్ళు. నీలంగా వినబడుతున్న ఈ రాగం, నింగి నుంచి నేలకు రాలేదు గదా! విశాఖ బీచ్‌లో రప్పురప్పున పగిలిన దీపాల పెంకులలా, రతి పారవశ్యంలో చిటిలిన గాజుల ముక్కలలా, సముద్ర ఘోషలో లయించిపోయిన మణితమూ ఉదయపు ఎండకు మెరుస్తున్నాయి.

పెదవులను మెల్లగా ఒత్తిగించి, రాత్రిని రెండుగా కత్తిరించి, ఎండను ఏడుతో మెత్తగించి, ఏడుపును మూడుతో గుత్తలించి, చించి, రచించి, విరచించి చిత్తగించండి!

కారాగారంలో రాజకీయ ఖైదీల చిత్రవధ. అరణ్యగర్భంలో మొరిగిన తుపాకి. లోయ లోపలి పాయ పక్కన తలకిందుగా వూగులాడే శవం!

ఆ శిలువ మీద ఉన్న దెవరు?

పలకరేం? గొంతు చించుకొన్నా ఉలకరేం? ఆ నెత్తురుచుక్క లెవరివి?

అవి "సత్యం" గారివి.

అవి "నిజం" గారివి.

మీ విశ్వాసాన్ని నేను దొంగిలించాను. అదిప్పుడు నా దగ్గర భద్రంగా ఉన్నది.

"భారతదేశం రత్నగర్భ! భారతీయుడు గర్భ దరిద్రుడు."

ఎవరన్నారు చెప్మా ఈ మాట?

కాగడాల కళ్ళల్లో భయం వినిపించింది. ఆగడం ( ఆకతాయితనం ) ఆగడం ( ఆగిపోవడం) వినిపిం చింది. కొత్త చివురును కనడానికి లేగొమ్మ పడే ప్రసవ వేదన వినిపించింది. పండుటాకు మనసులో మెదిలే తీయని జ్ఞాపకాల గొణుగుడు వినిపించింది. చూరునించి కిందికి దూకడానికి, భయంతో బిక్క చచ్చిపోయిన నీటి చుక్క గుండె చప్పుడు వినిపిం చింది. కాలు విరిగిన కుంటి చీమ ఏడుపు వినిపిం చింది. తేమకోసం అల్లాడిపోతున్న గరికపోచ వేళ్ళ ల్లోని ఆకలి కేక వినిపించింది. రేజర్ వంటి చూపు లతో, ఆడదాని అందాన్ని గీరడం వినిపించింది. రోడ్డు వారగా, చీకటి వీడని మాటున తారట్లాడే 'బజారు మనిషి' గొంతులోని ఏడుపు వినిపించింది. పోలీసుల కమురు దెబ్బలకు కమిలిపోయిన చర్మం సలపడం వినిపించింది. 1. ఆర్థర్ మిలర్‌కోసం, అర్ధ రాత్రివేళ 2. మార్లిన్ మన్రో కార్చిన కన్నీటి వేడి వినిపించింది. 3. కాన్‌స్టాంటినోపుల్‌లో, నేలమాళిగ ల్లాలలో చీకటిలో 4. వ్లాదిమిర్ ఇల్యిచ్ ఆత్మవిశ్వాసం వినిపించింది. 5. సోక్రటీస్ సంకల్పం వినిపించింది. 6. గియోర్డానో బ్రూనో నమ్మకం వినిపించింది. 7. ఆఫ్రొడైట్‌లో పించం విప్పుకొన్న వాంఛ వినిపించింది. శూన్యాన్ని చీరుతున్నప్పుడు, సూది మొన చేసే చప్పుడు వినిపించింది. 8. వింటర్ పాలెస్ శిఖరాలమీద 'అరోరా' అరుపు వినిపించింది. కిటికీ అద్దం మీద వాలిన సీతాకోక చిలుక రెక్కల చప్పుడు వినిపించింది. రెక్కలు మొలిచిన యుద్ధా శ్వాల సకిలింపులు వినిపించాయి. ఎండిన బానిసల చర్మాలు చేసిన తిరుగుబాటు పాటలు వినిపించాయి. శాంత మహాసముద్రం అడుగు పొరల నుంచి జలాంతర్గాముల గుసగుసలు వినిపించాయి. కత్తి కొస నించి దూకుతున్న హత్యా నినాదాలు వినిపిం చాయి.

గుసగుసలు వినిపించాయి.
వివాదాలు వినిపించాయి.
గుసగుసల కొసలు వినిపించాయి.
రణ న్నినాదాలు వినిపించాయి.
నిశ్శబ్ద శబ్దాలు వినిపించాయి.

భీకర భయంకర రణ ఘోష వినిపించింది. అగ్ని పర్వతాలు విరగబడి నవ్వడం వినిపించింది. సముద్రం శత కంఠాలతో ఘోషించడం వినిపించింది. ఆకాశ మంతటా కమ్మిన శత సహస్ర వాజ్రేయ శంఖాల నాదాలు వినిపించాయి.

వినిపించి, వినిపించి, సమీపించి, తనను సమీ పించి, తనలోకి ప్రవేశించి, లోలోపలికి ...

**(సశేషం)**

---

1. ప్రసిద్ధ అమెరికన్ రచయిత, మార్లిన్ మన్రో 5 వ భర్త. 2. ప్రపంచ ప్రఖ్యాత అమెరికన్ సినీనటి. 3. ఒకప్పటి రష్యా ముఖ్య పట్టణం. 4. లెనిన్ అసలు పేరు. 5. ప్రఖ్యాత తత్త్వవేత్త. 6. ప్రసిద్ధ ఖగోళ శాస్త్రవేత్త. 7. గ్రీకుల ప్రణయదేవత. 8. జార్ చక్రవర్తుల నివాస భవనం.



## సూర్యావర్తం




ఆర్యావర్తం పుణ్యభూమి
సూర్యావర్తం ధన్యభూమి
సంక్రమణ చంక్రమణంతో
సంక్రమించిన తేజో రాములతో
భారతీ పావన మందిర ద్వారాన
పలురంగుల రంగవల్లికలు దిద్దుతున్న
కన్యామణి కరకంకణ ధ్వనులు
కవీశ్వర కవనామృత ధునులు
హేమంత సీమంతనీ సీమంత సిందూరంతో
శ్రీమంతమైన సంక్రాంతి నాటి తెలుగు నేల
గోదావరీ కృష్ణ వేణీతరంగ తురంగాల
ఖుర సంఘట్టిత కేదారాల మాల
హర్ష పులకిత కర్షకావళి
అల్లదే! ప్రమోగిస్తున్నది ఆనందకాహళి
కష్టాలు నష్టాలు భరించేది కర్షకుతి
కడుపు నిండ్నాతిండి పెట్టేదీ కర్షకుని
ప్రకృతి బాధించినా భరిస్తాడు
జగతి వేధించినా సహిస్తాడు
సంక్రాంతి మంగళ దినోత్సవం నాడు
జాతి జనుల ఆశలు తీర్చే భారం వహిస్తాడు
తెలుగుతల్లి వెచ్చని ఒడిలో మనం
చలి మరచి పవళించే పసిబాలలం
ప్రాగ్దిశా సతీ ఫాల భాగాన
కోటి గోరంటలు కుంకుమార్చన
మిత్ర వరుణాగ్నులకు నేత్రము
మింట సూర్య రూపము పవిత్రము
అఖిల ప్రాణులకు జీవాత్మ సూర్యుడు
సుఖ దుఃఖాల్లో మానవులకు మిత్రవర్యుడు
మకర సంక్రాంతి పురుషాకృతికి
మానవ శతకోటి మస్తక న్యస్త హస్త నమస్కృతి!

**- డాక్టర్ దాశరథి**




**(క్రిందటి సంచిక తరువాయి)**

**"అబ్బా!"**

అని మూలిగాడు అమృతమూర్తి.

అతనికి చెమటలు పోశాయి. భయంగా, భయం భయంగా కళ్ళు విప్పాడు. మసక మసగ్గా వెలుగుతున్న దీపాలు! ఓ దీపం చుట్టూ రెక్కలాడిస్తూ తిరుగుతున్న చిన్న చిన్న పురుగులు— ఓ మూల నించి ఆగి ఆగి వినబడుతున్న ఇలకోడి చేసే చప్పుడు. ఎదురుగా, మంచానికి దగ్గరగా నిలబడి, తన వేపే చూస్తున్న సిస్టర్!

"ఎలా ఉంది?"

"మీరు చెప్పాలి!" అన్నాడు అమృతమూర్తి.

"బాధగా ఉందా?" అన్నది సిస్టర్.

అమృతమూర్తి తన కెలా ఉన్నదో చెబుదామని ఓ క్షణం ఆలోచించాడు. ఎలా ఉన్నదో కొంచెం కొంచెం తెలుస్తూనే ఉందిగానీ -- ఎలా చెప్పడమో తెలీడంలేదు. 'పోనీలే!' అనుకొన్నాడు.

"ఏమీలేదు, సిస్టర్! బాగానే ఉన్నాను!" అన్నాడు అమృతమూర్తి చివరికి.

"అబ్బా! అన్నారు. ముఖమంతా ముడుచు

కున్నారు ... ఏమన్నా ఉంటే చెప్పండి. డాక్టర్ని పిలుస్తాను" అన్నది సిస్టర్.

"అబ్బా! — అన్నానా?" అని సన్నగా నవ్వాడు అమృతమూర్తి. "అసలు — అలా అన్నట్టుగా నాకు తెలియనే తెలియదు, సిస్టర్!" అన్నాడు అమృతమూర్తి లేవడానికి ప్రయత్నిస్తూ.

"లేవకండి! పడుకోండి."

"అబ్బా— అనా అన్నాను? ఇంకేమన్నా అన్నానా, సిస్టర్?" అన్నాడు అమృతమూర్తి ఎడమ చేత్తో దుప్పటిని పక్కకు తోస్తూ నర్స్ ముఖంలోకి ఆసక్తిగా చూస్తూ.

"లేవకండి!" అంటూనే సిస్టర్ వో చిన్న మందు బిళ్ళను అమృతమూర్తికిచ్చి మింగమన్నది.

"మింగుడు పడడం లేదు" అన్నాడు అమృతమూర్తి.

"ఆఁ— అనండి."

కాస్సేపు గునిపి, ఆ మందు గుటకవేశాడు




అమృతమూర్తి. అతనికి సిస్టర్‌తో ఇంకేదో చెప్పాలనీ, చెప్పుకోవాలనీ ఉంది. అలా చెప్పుకోవడానికి మాటల కోసం వెదుక్కుంటున్నాడు. ఆ వెదుకులాట ఇంకా పూర్తికాకముందే—సిస్టర్ మందు మింగించింది... మందు మింగకూడ దనుకున్నాడు అమృతమూర్తి. తను చెప్పవలసింది చెప్పాకనే — మందు తీసుకుందా మనీ అనుకొన్నాడు. కానీ — అత ననుకొన్నట్టు జరగలేదు ... జరగలేదు సరికదా, అనుకోనట్టుగా జరిగింది. రెప్పలు బరువెక్కాయి. ఆ బరువునుఆచుకో లేక మెల్లిగా కిందికి వాలుతున్నాయి. వాలుతున్న రెప్పలను బలవంతాన నిలుపుదా మనుకొన్నాడు. నిలపలేకపోయాడు. కళ్ళు మూతలు పడ్డాయి.

ఒక నిమిషం అతనివేపే చూసింది సిస్టర్! ఆ కళ్ళు మూసుకునే ఉన్నాయి.

బద్ధకంగా ఆవలించింది సిస్టర్!

ఈ కన్ను లిలా మూసుకున్న క్షణానే, అతని అంతర్నేత్రాలు విచ్చుకొన్న సంగతి సిస్టర్‌కు తెలియదు.

అత నింకా నిద్రపోతున్నాడనే అనుకొన్నది.

● ● ● ●

రేడియో తరంగాల మీద కూచుని, దూరదూరాలకు పాకిపోతున్న అసత్యాలు కనిపించాయి. పగిలిన మనస్వప్నాల శకలాల మీద పడుతున్న రాబందుల నీడలు కనిపించాయి. గిరి శిఖరాల మీద పేరుకు పోయిన ఆదిమ యుగాల, అంధాంధ తమస్సులు కనిపించాయి. విశ్వామిత్రుని తపోభంగానికై, తనను తానర్పించుకున్న క్షణాన, మేనక కన్నుల్లో ఉరలిన నీటి పొరలు కనిపించాయి. (1) పిథియస్‌ను వరించి, తననించి దూరమయ్యే నందుకు తపించి, కుప్పించి శూలం మీదికి లంఘించిన (2) అగస్తినా కళ్ళు కనిపించాయి. తనను బంగారు తాడుతో ఉరితీయమంటూ దరఖాస్తు పెట్టుకొన్న (3) ముంబాగో గాంబోజీ పెదవుల మీది దరహాస రేఖలు కనిపించాయి. (4) నెపోలియన్ నవ్వించి, కవ్వించి, ఆద్దుకొని, రుద్దుకొని, తిరస్కృతయైన (5) జోసెఫిన్ అంతరాంతరాల్లో రగిలే ప్రణయ జ్వాలలు కనిపించాయి.

(1) గ్రీకు వీరుడు. (2) పిథియస్‌ను ప్రేమించిన సౌందర్యవతి. (3) దక్షిణాఫ్రికా జానపద కథల్లోని యోధుడు. (4) ఫ్రాన్సు చక్రవర్తి — మహావీరుడు. (5) నెపోలియన్ భార్యలలో ఒకతె.

అబద్ధాలను అందంగా పాక్ చేసి, అందరికీ అమ్మే పత్రికలు కనిపించాయి. నల్ల బల్లమీద చెరిగీ చెరగని, ఎన్రికో ఫెర్మీ సమీకరణం కనిపించింది. అందరూ ముసురుకుని, ఒరుసుకుని, మురుసుకుంటున్నా, ఎవ్వరూ లేరనుకుని రొమ్ముల్ని సవరించుకుంటున్న బోడె రెక్ బొమ్మ కనిపించింది. శబ్దం కాలిపోయి, నిశ్శబ్దమయ్యాక, నిశ్శబ్దం నల్లబడినాక, నల్లని నిశ్శబ్దం చల్లబడినాక, దోవ తెలీక ఆడరిపోయి, బెదిరిపోయి, పారిపోతున్న శుష్క వినాదాల జాడలు కనిపించాయి. అందమైన అమ్మాయి ( గారి ) మరీ అందమైన తొడమీద దురద మందు ప్రకటన కనిపించింది. తనమీద బాహాటంగా జరుగుతున్న రంగుల కుట్రల్ని, హత్యల్ని, దొంగతనాల్ని, మోసాల్ని, దోసాల్ని, ముద్దుల్ని, గుద్దుల్ని లంజరికాల్ని, మాయల్ని, మంత్రాల్ని, అభూతకల్పనల్ని, స్తనాల పూపుల్ని, నడుం ఒణుకుల్ని, తొడల మెరుపుల్ని సహించలేక, రుంజుకుని, రుంజుకుని, తిరగబడిన తెల్లని సినిమా తెర కనిపించింది. పిచ్చెక్కిన లాటీకర్రలు, గుంపులమీద చేసే బృందనాట్యం కనిపించింది. యూని ఫారంలో ఉక్కిరి బిక్కిరవుతున్న కసి కనిపించింది. పూదారంగు గాలికి వూగి పోతున్న మంటలు కనిపించాయి. కపటం మీంచి, వంచన మీంచి, ప్రల్లదాల మీంచి, ప్రేఘుల వదనాల మీంచి, అధ్యాపకుల అరకొర జ్ఞానం మీంచి, చనిపోయిన ఆలోచనల మీంచి, విశ్వ విద్యాలయాల మంగు వాసనల మీంచి, కుహనా సంస్కారం నేర్పిన మాయదారి బతుకుల మీంచి తళతళ లాడుతున్న ముచ్చి బంగారపు ముసుగులు కనిపించాయి.

పాపం బద్దలవడం కనిపించింది. మంచు మీద, మంచితనం మీద విరుచుకు పడిన డేగ కనిపించింది. విద్యుత్కణాల గుండె పొరల మాటున దాంకొన్న రహస్య సంకేతం కనిపించింది. పసి నిసుగుల పెదవుల పయి, అప్సరాంగన అంటించిన దరహాసరేఖ కనిపించింది. మృదుత్వాన్ని సూనృతాన్ని, సమత్వాన్ని, సత్యాన్ని నీలితెరలు కప్పేయడం కనిపించింది. నక్షత్రాలు నెత్తురు కక్కడం కనిపించింది. ఆశలు అలిసి పోవడం కనిపించింది. 1. పాల్ ఎర్లిష్ కంటనీరెట్టుకోడం కనిపించింది. 2. ధియోడోరిక్ ఆజ్ఞలను, 3. కాసియోడోరస్ శిరసావహించడం కనిపించింది. కారాగారంలో పద్మాసనం వేసుకుని, తత్త్వశాస్త్రానికున్న దుఃఖోపశమన శక్తిని గురించి, 4. బోధియస్ ఆలోచించడం కనిపించింది. 5. సైక్లోప్స్ రాక్షసులు, 6. కాలిప్సో సుందరిని చెరబట్టడం కనిపించింది. యూఫ్రటిస్ నదీ తీరాన, అకాడమీ వదిలిన అడుగుజాడ కనిపించింది. టైగ్రిస్ తరంగాల మీద తేలిపోతున్న 7. ఆల్ బినస్, 8. ఫ్లాక్కస్ కవుల కవితల కళేబరాలు కనిపించాయి. దేశాటనంలో కందిపోయిన 9. కాస్మాస్ పాదాలు కనిపించాయి. సంధి సంప్రదింపుల కోసం

1. వైద్య శాస్త్ర పరిశోధకుడు. 2. ధియోడోరిక్ ఒక గోథురాజు. 3. ఈ రాజుగారి కార్యదర్శి, లేఖకుడు. 4. రోమన్ పండితుడు, గ్రంథకర్త. 5,6 గ్రీకు పురాణాలలోని పాత్రలు 7,8: ఆచెన్ ప్రభువుల రాజభవనంలో, చార్లమెన్ చక్రవర్తిగారి వినోదం కోసం పండిత చర్చలను జరిపే విద్వాంసుల రోమన్ నామధేయాలు. 9. ఈజిప్టు పరివ్రాజకుడు. బహు దేశసంచారి.

బైజాంటియం ప్రభువు 1. జిమిస్కేస్ తహతహలాడడం కనిపించింది. ఫిబినెగ్‌లు వధించిన 2. స్వియతోస్లావ్ శిరస్సు నవ్వడం కనిపించింది. సూదిమొన మీద 3. మోనాలిసా చిరునవ్వు కనిపించింది. 4. సెయింట్ సోఫియా చర్చిమీద కన్నీటి పొగ కనిపించింది. 5. ఆనా కెరినీనా గుండెల్లోని తీయని గుసగుసలు కనిపించాయి. నైలునదిలోకి వాలి, తూలి, కూలిపోతున్న కాలం కరళ్ళు కనిపించాయి. 6. క్లియోపాత్ర చెక్కిలిమీది నీలి పుట్టుమచ్చ కనిపించింది. 7. గెలీషియా గగనం నుంచి జారి పడిన హాహాకారాల శిథిలాలు కనిపించాయి. 8. ఆంద్రీ రుబ్లేవ్ చిత్రించిన దేవతాత్రయంలోని పునీతాత్మలు కనిపించాయి. ఫ్లోరెన్స్ నగర వీథులలో 9. లియోనార్డోడవిన్సీ వెర్రిగా తిరుగాడడం కనిపించింది.

రావూరి భరద్వాజ

1. ఇతనికీ రష్యనులకూ యుద్ధం జరిగింది. 2. ఇతను రష్యా దేశపు రాజు. 3. లియోనార్డోడవిన్సీ చిత్రించిన విశ్వ విఖ్యాత వర్ణచిత్రం. 4. క్రీస్తుశకం 1038 లో యరోస్లావ్ చక్రవర్తి నిర్మించిన క్రైస్తవ దేవాలయం 5. టాల్‌స్టాయ్ నవలలోని కథానాయిక. 6. ఈజిప్టురాణి—జగదేకసుందరి 7. ఇప్పటి పోలెండు దేశం. 8. 14 వ శతాబ్దిలోని రష్యన్ చిత్రకారుడు. 9. ప్రఖ్యాతి చెందిన ఇంజనీర్ చిత్రకారుడు, మేధావి.

పడుతూ, భయపడుతూ, పరుగెడుతూన్న 1. శర్విటన్ అలసట కనిపించింది. 2. ప్రోక్సిమాసెంటారీమీద తార్తారులు దాడి చేయడం కనిపించింది. ఆండిస్ పర్వతగుహల్ని, శిల్పాలుగా మలుస్తున్న 3. అగస్తి నోకస్ ఉలి పదును కనిపించింది. మధ్యధరాసముద్ర తరంగాల మీదుగా తూగాడే ఫొనీషియన్ పడవ తెరచాప కనిపించింది. 4. చెంఘిజ్‌ఖాన్ కొరడా కొస నించి రాలిన క్రోధాగ్ని జ్వాలాతోరణం కనిపించింది. అందంగా ఒంపు తిరిగిన 5. లిజ్‌వక్షోజాలు కదలడం కనిపించింది. ఆకలి కనిపించింది. దాని కల్లంత దూరంలో ఉన్న ఆహారం కనిపించింది. ఆశ కనిపించింది. రవంత ఆసింటాగా అపరంజి కనిపించింది. ధ్వని పగలడం కనిపించింది. గీతలు ఒయ్యారంగా నడవడం కనిపించింది. దిశాంతాలు కలుసుకోవడం కనిపించింది. కండలోనికి దిగుతున్న సూదికొన

1. స్పెయిన్ దేశీయుడు. వైద్యశాస్త్రవేత్త. దేశీయుల మత మౌఢ్యానికి తాళలేక స్విట్జర్లాండు పారిపోయాడు.. 2. సూర్యుని తరవాత మనకు దగ్గరగా ఉన్న నక్షత్రం. 3. గ్రీకు శిల్పి. 4. మంగోలియావీరుడు. 5. ఎలిజబెత్ టేలర్—సినిమా నటి.

ఖన్నువుని విసుక్కోవడం కనిపించింది. మంటలను పండించే ఎడారి ఎదురురొమ్ము మీద ఒయాసిస్ పచ్చల పతకం కనిపించింది. రాళ్ళను తొలిచి, ఒలిచి, తోసుకొస్తున్న నీటి జాలు పదును కనిపించింది. కనురెప్పల మీద నీలంగా మెరుస్తున్న కోరిక కనిపించింది. చిన్న చిన్న దీపాలను మోసుకుంటూ, పాడుకుంటూ, ఆడుకుంటూ పోతున్న మిణుగురుల చాలు కనిపించింది. వీణామండలం నించి చిందిపడుతున్న గాంధరవ శకల సమూహం కనిపించింది. శ్రవణబెళగొళ పర్వతం మీద పారదర్శకంగా ఉన్న పలచని గాలి కనిపించింది.

● ● ● ●

నటి: నాకు బోధపడ లేదు.

సూత్ర: బొత్తిగానా?

నటి: అని కాదు కానీ పూర్తిగా మాత్రం బోధ పడలేదు.

సూత్ర: అందులో విడ్డూరమేమీ లేదే.

నటి: ఉన్నదని నేనూ అనడం లేదు కానీ ఎందుకల్లాగా? అని మాత్రం అంటున్నాను.

సూత్ర: ఎందుకంటే చెప్పనా? ఈ మనస్సు ఒక పెద్ద పాతర. బుద్ధిమంతులైన వారు, ఈ పాతరను మూడు భాగాలుగా చేశారు. అన్నిటికన్నా అట్టడుగున ఉన్న పొర, మరీ అధ్వాన్నమయింది. భయంకరమయింది. యుగ యుగాల, తరతరాల నాటి జాంతవిక, పాశవిక వాంఛలన్నీ ఈ పొరలో బుసలు కొడుతూ మసులుతుంటాయి.

క్రూరమైన, అమానుషమైన, అసంభవమైన, అవాంఛనీయమైన వన్నీ ఇందులో దాగొంటాయి. ఈ పొరకు 'అధోచైతన్యం' అని పేరు పెట్టారు శాస్త్రజ్ఞులు. రెండవ పొర, అడుగుదాని కన్నా చాలా మెరుగు. ఇందులోనూ అసంభావ్యాలు, అసంబద్ధాలు కోకొల్లలుగా ఉంటాయి. బాహిర జీవితంలో మనం సాధించ లేనివీ, పొందలేనివీ ఈ రెండో పొరలోకి వెళ్ళి పొందుతూ ఉంటాం. 'సృజనాత్మకత' ఈ పొరలో ఎక్కువగా ఉంటుంది. దీన్ని 'సుప్త చైతన్యం' అంటారు. ఈ రెండింటి కన్నా పైమెట్టున ఉన్నది మూడవ పొర. ఈ మూడవ పొరమీద—సామాజిక వాతావరణం, సభ్యత, సంస్కృతి, మర్యాద, లౌక్యం వంటి వాటి ప్రభావం అగ్గలంగా ఉంటుంది. ఒక మడ్డి వెధవను చూసి, సుప్త చైతన్యంలో అసహ్యించుకుంటాం. చైతన్యంలో మెచ్చుకుంటాం. ఇదే మడ్డి వెధవ మీద మనకు చెప్పరానంత ఏహ్య భావం కలిగినప్పుడు, వాణ్ణి నిర్మూలించాలన్న కోరిక క్రమ క్రమంగా బలపడుతుంది. ఈ కోరిక తాలూకు వేళ్ళు అధో చైతన్యంలోకి పాకుతాయి. అక్కడది అనేక రూపాలు ధరిస్తుంది. కొంత మందిని చూస్తే అకారణ ద్వేషం కలుగుతుంది. దాని క్కారణం, ఆ ద్వేషించే వ్యక్తికీ తెలియదు. అప్పుడెప్పుడో, ఎక్కడో, ఎందుకో ఎవరినో ద్వేషించి ఉండవచ్చు. అవతలి వానిలో ఉండే ఏ చిన్న లక్షణమో, అధో చైతన్యంతో ఉండిపోయి ఈ వ్యక్తిని చూడగానే బుస కొట్టవచ్చు. ఫలితంగా అకారణ ద్వేషం కలగవచ్చు. చెప్పవలసిందేమిటంటే, నీ అధో చైతన్యంలోని విషయాలు నీకే తెలియవు కదా! మరొకరి విషయా లెలా తెలుస్తా యనుకున్నావమ్మా?

నటి: ఇహ తెలుసుకొనే మార్గమే లేదంటారా?

సూత్ర: ఉంది. నీవు మాట్లాడే మాటల ఆధారంగానే నీ సుప్త చైతన్యంలో ఏం జరిగేదీ తెలుసుకోవడ మొక్కటే మార్గం! నువ్వెంత హాయిగా, తీయగా, చల్లగా, మెల్లగా మాట్లాడినా, నీ అసలు స్వరూపం నీ మాటల మాటున దాగొనే ఉంటుంది. ఈ విద్యలో కొందరు రాజకీయ వాదులు, వాణిజ్య వర్గాల వారు, సినిమాల వాళ్ళు ఆరి తేరారు. వారి మాటలు ఆధారంగా వారి వారి స్వరూపాలను తెలుసుకోవడం అసంభవం కాదుకానీ, సులభసాధ్యం కూడా కాదు. అమృతమూర్తి వ్యవహారం వేరు. అతనికి తీరిన కోరికల కన్నా తీరని కోరికలే ఎక్కువగా ఉన్నాయి. ఏదో ఒక లక్ష్యాన్ని ఉంచుకుని, అది చేరాక సంతృప్తి పడడం అతనికి చాత కాదు. ఆ లక్ష్యాన్ని చేరుతూనే, కొత్త లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, వాటిని చేరడం కోసం, అష్ట కష్టాలూ పడడం అతని కొక హాబీ అయిపోయింది. లభించిన దానివల్ల ఆనందం పొందడం అతనికి కుదరని పని. అందువల్ల అందనిదానిని అందుకోవడం కోసం పడే ఆరాటం నుండీ అతను ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నాడు.

నటి: ఏం ప్రయోజనం చెప్పండి?

సూత్ర: ఈ మాటే అమృతమూర్తి అనుకుంటే అసలు కథే లేదు. ఆలోచిస్తే ఈ ధోరణి వల్ల కొంత ప్రయోజనం లేకపోలేదనిపిస్తుంది. ఉన్న దానితో తృప్తి పడక పోవడం, రాని దానికోసం ప్రయత్నించడం చాలా సందర్భాలలో ఆ ప్రయత్నాలు విఫలం కావడం, అందువల్ల నిరాశ పడడం, ఆ నిరాశాంధకారం నుండి బయట పడేందుకు, అందుకు దోహదం చేసే పుస్తకాలను చదవటం, ఆ తరహా వ్యక్తులను కలుసుకోవడం, ఆ వ్యక్తులు మరో నూతన ప్రపంచాన్ని మన కథా నాయకునికి చూపించడం, దాన్ని గురించీ మళ్ళీ మళ్ళీ ఆలోచించడం—ఇల్లాగా సాగి పోతున్నది ధోరణి. అమృతమూర్తి ప్రస్తుతం ఆ ధోరణిలోనే ఉన్నాడు.

నటి: దానికి రుజావు లేమిటి?

సూత్ర: అతని సుప్త చైతన్యం నీవు ఎరగని దేమీ కాదే!

నటి: కాదు కానీ నా కది పూర్తిగా అవగాహన కాలేదు.

సూత్ర: విడమరిచి చెప్పవచ్చు కానీ, దాని కిది తగిన సమయం కాదు.

నటి: అమృతమూర్తి అటూ, ఇటూ కదులు




తున్నాడు. గమనించారా?

సూత్ర: అది భౌతిక జీవితానికి సంబంధించిన చర్య. అతని అధి భౌతిక జీవితంలోనూ ఏదో కదలిక వచ్చి ఉండాలి. అలా లేకపోతే అత నంత ప్రశాంతంగా, హాయిగా ఉండడు.

నటి: అదేమై ఉంటుందంటారు?

సూత్ర: మరో క్షణంలో తినబోతున్నావు. రుచు లడగడం భావ్యం కాదు.

● ● ●

"రండి, బాబుగారూ, రండి! నేనూ మీ కోసమే ఎదురు చూస్తున్నాను. సమయాని కొచ్చారు" అన్నాడు అమృతమూర్తి కొంచెంగా పక్కకు తిరిగి.

"మీ కబురు నాకు ఆలస్యంగా అందింది" అన్నా రాయన, పక్కనే ఉన్న కుర్చీని మంచానికి దగ్గరగా లాక్కుంటూ.

అమృతమూర్తి ఆప్యాయంగా ఆయన కేసి చూశాడు. చూసి మెల్లగా చెప్పడం ప్రారంభించాడు.

"నా కిప్పుడు అరవయ్ సంవత్సరాలు దాటాయి, వివేకానందంగారూ! అన్నీ సక్రమంగా ఉంటే రేపో మాపో షష్టిపూర్తి కూడా చేసుకో బోతున్నాను. ఈ ఇంతకాలం లోనూ నేను చేసిన

పనులన్నీ గుర్తు చేసుకుని చూస్తే నా మీద నాకే జాలి కలుగుతున్నది."

"ఎందుకనీ?" అన్నాడు వివేకానందం.

"మీకు తెలియందేమీ కాదండీ! అయినా అడిగారు కనక చెబుతున్నాను. మరీ చిన్నతనం రోజులు, చదువుకుంటున్న రోజులు మినహాయించండి. గడిచిన నలభయ్ సంవత్సరాల కాలంలోనూ అందరికూ చేశాను కానీ నాకు నే నేమీ చేసుకోలేక పోయాను, వివేకానందం గారూ! నా భార్యకు, నా బిడ్డలకు, నా స్నేహితులకు, వారి స్నేహితులకు, నాపై అధికారులకు, నా కింది ఉద్యోగులకు చాలా చేశాను."

"అవును. నీది మంచి రికార్డ్" అన్నాడు వివేకానందం నవ్వుతూ.

"ఆ తృప్తి నా కుంది" అని ఒక క్షణకాలం ఆగాడు అమృతమూర్తి. "మీ రన్నది నిజమే నండీ! కానీ, అవేవీ నాకు నేను చేసుకున్నట్లు కాదు కదా, వివేకానందంగారూ! నేను వేరు, నా భార్య వేరు—నేను వేరు, నా బిడ్డలు వేరు. అలాగే నేను వేరు, నా స్నేహితులు, వారి స్నేహితులు, నా పై అధికారులు, నా కింది అధికారులు వేరు. అంతదాకా దేనికి, బాబుగారూ! 'ఇది నా ఇల్లు. ఇది నా పొలం. ఇది నా శరీరం' అనుకుంటున్నప్పుడే నేను వేరూననీ, ఇల్లు, పొలం, శరీరం వేరూనని తేలిపోతున్నది. శరీరమే కాదండీ! శరీరంలోని భాగంకూడా నేను కాదు. నా కాలు, నా చెయ్యి, నా కన్ను అంటున్నాం. నా కోసం, నా ఆనందం, నా విషాదం, నా విచారం, నా తృప్తి, నా మనస్సు, నా ఆత్మ...ఇల్లాగ ఎన్నింటి నయినా చెప్పుకుంటూ పోవచ్చు. ఇవన్నీ 'నేను' కాదు. వీటన్నింటినీ కలుపుకుని ఉన్నప్పుడూ 'నేను' ఉన్నాను. వీటన్నింటినీ వదిలేసినప్పుడూ 'నేను' ఉన్నాను."

"అవును. వీటికి భిన్నంగానే, దూరంగానే నీవున్నావు" అన్నాడు వివేకానంద.

"అవును కదా, బాబుగారూ! అయినప్పుడు, వీటన్నింటినీ నే నుంచుకోవడం నాకు అదనపు భారం కాదా? వీటన్నింటితోనూ కలిసి ఉన్నప్పుడూ, వీటన్నింటినీ వదులుకున్నప్పుడూకూడా 'నేను' ప్రత్యేకంగానే మిగిలి పోతున్నప్పుడు ఈ బాదర బందీని ఉంచుకోవడంలో అర్థం కనిపించడం లేదు. దీన్ని వదిలించుకుందామనుకుంటున్నాను కానీ వదలడం లేదు" అన్నాడు అమృతమూర్తి.

వివేకానందం హాయిగా నవ్వాడు.

"నవ్వారేం?" అన్నాడు అమృతమూర్తి.

"ఆదేదో 'వదలడం లేదు' అని సులభంగా అన్నావు కానీ, వదుల్చుకోవడానికి గట్టిగా ప్రయత్నించావో, లేదో ఆలోచించావా? వదిలి పోతే బాగుండుననీ అనుకుంటాం. వదిలించుకుందామనీ అనుకుంటాం. కానీ ఇవన్నీ మనల్ని వదిలి పోతున్న వేళకు, మనం గిలగిల లాడి పోతాం. అవి పోకుండా అచి, సాచి, పట్టుకుని, ఉంచేసుకోవడానికి ఆరాటపడుతూ ఉంటాం!" అన్నాడు వివేకానందం!

"నిజమేనండీ! నా వెంట రానిదాని కోసం నే నెందు కిలా తపన పడుతున్నానో తెలీదు. నాది కాని




ఓ బెంచాడు సిమ్మెంటు
తగతెయ్యి తేశపొయ్యావ్!

దాని కోసం నే నెందు కిలా ఆరాట పడుతున్నానోకూడా తెలీదు. చిరిగిపోయిన ఈ చొక్కా కోసం, ఈ అద్దె కొంపకోసం నే నెందు కింత ఆవేదన పడుతున్నానో అవగాహన కావడం లేదు. నామీద పేడుగోనె కప్పినా, బ్రహ్మాండమయిన పిరమిడ్ కప్పినా, ఒక్కటే అయినప్పుడు పిరమిడ్ కోసమే ఎందుకు పాకులాడుతున్నానో నాకు బోధ పడటం లేదండీ" అన్నాడు అమృతమూర్తి.

అమృతమూర్తిని అదే పనిగా చూస్తున్నాడు వివేకానందం!

"నా కింకో అనుమానంకూడా ఉన్నదండీ! ఇల్లాగ అన్నింటినీ వదులుకుని—అంటే భార్యా బిడ్డలను, స్నేహితులను, అవయవాలను, శరీరాన్ని, మనస్సును, మనస్సులో చెలరేగే భావాలను, అనుభూతులను, ఆత్మను—వదులుకుని ఈ 'నేను' ఉండటం సాధ్యమే నంటారా, వివేకానందంగారూ?" అన్నాడు అమృతమూర్తి.

వివేకానందం మరోసారి హాయిగా నవ్వాడు.

"నీ ప్రశ్న పెద్దది. దానికి చెప్పుకోవలసిన జవాబు ఇంకా పెద్దది. అలా చెప్పుకోవడానికి మనకున్న వనరులు మాత్రం చాలా పరిమిత మైనవి. ఈ ప్రపంచాన్ని మనం అవగాహన చేసుకోవడానికి పంచేంద్రియాలూ తోడు పడతాయి. ఈ ఇంద్రియాలు అల్పమైనవి. ఇవి మన కందించే జ్ఞానం ఇంకా అల్పమైంది. ఈ అల్పేంద్రియాలతో, అల్ప సాధనాలతో, అల్ప జ్ఞానంతో అనల్పమూ, అనంతమూ, అవ్యయమూ అయిన సృష్టిని అవగాహన చేసుకోవాలి. ఇదీ మన ముందున్న అసలు సమస్య. మన ఇంద్రియాలు మనకు ఎల్లప్పుడూ సత్యాన్నే చెబుతాయనికూడా మనం అనుకోనవసరం లేదు. చాలా సార్లు ఈ ఇంద్రియాలు మనను అపమార్గం పట్టిస్తాయి. ఇవి అనారోగ్యంగా ఉన్నప్పుడూ, మనస్సు అనారోగ్యంగా ఉన్నప్పుడూకూడా మనకు సరైన సమాచారం లభించదు. ఒక్క ఉదాహరణ చెబుతాను. ఏ పొదమాటునో ఒక పూవు ఉన్నది. అది నీకు కనిపించడం లేదు కానీ వాసన ద్వారా అక్కడా పూవు ఉన్నట్లు మనం గ్రహించ గలుగుతాం. వాసన చూసే శక్తిని మనం కోల్పోయామనుకో. అప్పుడు మనకు సంబంధించినంతవరకూ ఆ పూవు అక్కడ లేనట్లే! అయితే అక్కడ పూవు ఉండటం సత్యమా? ఉండకపోవడం సత్యమా? ఘ్రాణశక్తి గలవానికి పూవు ఉండడం సత్యం. అది కోల్పోయిన వానికి పూవు లేకపోవడం సత్యం. ఒకే వస్తువు ఒకే సమయంలో అటు సత్యంగానూ, ఇటు అసత్యంగానూ భాసించడానికి కారణం వ్యక్తుల కున్న ప్రత్యేక పరిస్థితులు మాత్రమే" అన్నాడు వివేకానందం.

అమృతమూర్తి ఏమీ అనలేదు. వివేకానందాన్ని అదే పనిగా చూస్తున్నాడు.

"నేను చెప్పదలుచుకున్నది స్పష్టంగా చెప్పలేక పోతున్నానేమో ననుకుంటున్నాను, అమృతం! సూచనగా నైనా నీకు అందించ గలిగానా అని!"

"ఇంతవరకూ నా కెక్కడా అస్పష్టత కనిపించ లేదండీ! కాకపోతే, అనుమానాలు మాత్రం కనిపించాయి. మన ఇంద్రియాలు మనకు అందజేస్తున్నది సంపూర్ణ సత్యం కానప్పుడు, ఇంద్రియాల ద్వారా మనస్సుకు అందేదీ సంపూర్ణ సత్యం కాబోదు. అవునా?" అన్నాడు అమృతమూర్తి.

"అవును."

"అయినప్పుడు ఈ ఇంద్రియాలను నమ్ముకుని ప్రయోజన మేమిటండీ?" అన్నాడు అమృతమూర్తి.

వివేకానందం తేలిగ్గా నవ్వేశాడు.

"ఇంద్రియాలు సంపూర్ణ సత్యాన్ని అందించ లేవు కనక, అవి అందించగల అరకొర సత్యాలను త్రోసిపుచ్చడానికి కుదరదు. అలా చేసినప్పుడు మనకు ఆ పాటి సత్యంకూడా లభించదు. మనం చేయవలసిందేమిటంటే, జ్ఞానేంద్రియా లందించే అల్ప సత్యాలను అందుకుందాం. అందుకుని, పూర్ణ సత్యం కోసం ప్రయత్నించుదాం! అలాంటి ప్రయత్నం ఏది చేయాలన్నా, మనకు ఎంతో కొంత 'ఆధారం' కావాలి. ఈ 'ఆధారం' మనకు జ్ఞానేంద్రియా లిచ్చిన సమాచారమే!" అన్నాడు వివేకానందం.

"దీన్ని ఇంకొంచెం వివరంగా చెబుతారా?" అన్నాడు అమృతం.

వివేకానందం నవ్వాడు.

"ప్రయత్నిస్తాను. బీజంలో కొంత ఆహారం నిక్షిప్తమయి ఉంటుంది. బీజంలోని జీవశక్తి మొలకగా రూపొందిన తొలి దశలో ఈ ఆహారం మీదనే అది ఆధార పడుతుంది. ఇది కేవలమూ ఆధారమే కానీ, ఇదే సర్వస్వం కాదు. ఈ ఆధారం సాయంతో ఎదిగిన మొక్క పరిసరాల నించి తనకు కావలసిన ఆహారాన్ని కావలసినంత సేకరించుకుంటుంది. మానవుడూ అంతే!

జ్ఞానేంద్రియాల ద్వారానూ, ఇతర సాధనాల ద్వారానూ తెలుసుకున్న సత్యాన్ని ప్రాతిపదికగా చేసుకోవాలి. దీని ఆధారంతోనే తాను సేకరించిన దాన్ని కలుపుకుంటూ, చేర్చుకుంటూ పోవాలి. మన అనుభవం పెరుగుతున్న కొద్దీ, అవగాహన పెరుగుతున్నకొద్దీ సత్య స్వరూపం కూడా పెరుగుతూనే ఉంటుంది" అన్నాడు వివేకానందం.

"కాబట్టి ఈ అల్పమైన అవయవాల మీదనే మనం ఆధారపడకూడ దంటారు. అవునా?" అన్నాడు అమృతమూర్తి.

"అవును."

"నా కిక్కడో అనుమానం, వివేకానందంగారూ. ఆదేమిటంటే—వింటున్నారా? వింటున్నారా? వినపడుతూందా?"

(సశేషం)

**(క్రిందటి సంచిక తరువాయి)**

"**ఇశ్శో!** అలా అరవకండి!" అంటూ బుజ్జగించింది సిస్టర్ గ్లోరీ.

"అరిచానా?" అన్నాడు అమృతమూర్తి ఆశ్చర్యపోతూ.

"ఎక్కడో దూరంగా ఉన్నవారికి, అరిచి చెబుతున్నట్టూ, చెడిపోయిన టెలిఫోనులో మాట్లాడుతున్నట్లూ అరిచారేం?" అన్నది సిస్టర్ గ్లోరీ.

"నాకా సంగతే తెలీదు, సిస్టర్!" అన్నాడు అమృతమూర్తి.

"మీకేమన్నా బాధగా ఉందా?"

"లేదు" అన్నడు అమృతమూర్తి.

"ఇబ్బందిగా ఉందా?"

బాధకూ, ఇబ్బందికీ మధ్య గల తేడా ఏమిటో అమృతమూర్తికి బోధ పడలేదు.

"ఇప్పుడు టైమెంత, సిస్టర్?"

"రెండూ పది!" అన్నది గ్లోరీ.

"కూచోండి."

ఒక క్షణం తటపటాయించి, స్మాల్ లాక్కుని కూచున్నది.

గ్లోరీ కేసి చూసి, మళ్ళీ చూసి, మళ్ళీ మళ్ళీ ఉంది.

పెదవుల మీంచి వేలు తీయకుండానే ఏదో మాట్లాడబోయాడు.

"ఇదివర కెప్పుడన్నా మీ కిలాగే వచ్చిందా? తల తిప్పండి చాలు" అన్నది గ్లోరీ.

"వచ్చిం"దన్నట్టు తల తిప్పాడు అమృతమూర్తి.

"అప్పు డే డాక్టరు చూశారు?"

ఈ ప్రశ్నకు జవాబు తల వూపడం ద్వారా చెప్పడం సాధ్య పడుతుందేమో ప్రయత్నించాడు అమృతమూర్తి. మనిషి పేరున్న సైగల ద్వారా చెప్ప డానికి తను చేస్తున్న వెఱి ప్రయత్నానికి నవ్వు కున్నాడు. నవ్వుకున్నాడు కానీ ఒక ప్రశ్నకు జవాబు కూడా లీలగా అతనికి తోచింది.

"నేను రావుగారితో—డాక్టర్ రావుగారు నాకు వైద్యం చేశారు—పదాఢు మాసాలున్నాను ఆస్పత్రిలో, మొదటి రెండు వారాలూ— అవును—అక్కడే—నిన్ను చూశాను. నీ పేరు—నీ పేరు..."

"గ్లోరీ!"

"కాదు—మంచి పేరు—నేను చాలాసార్లు అనుకున్నాను—జాస్మిన్—అహఁ—కాదు. నవ్వు మీదుగా వస్తుందా పేరు—హాసిత—కాదా? స్మిత! అవునా? స్మిత! నీ పేరు స్మిత."

గ్లోరీ ఆ ప్రశ్న వింటూనే వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఇశ్శో! ఏడవకు. ఒక్క సంగతి చెప్పు. స్మిత—కులాసాగా ఉన్నదా! ఆ ఒక్క ముక్కా చెప్పు చాలు" అన్నాడు అమృతమూర్తి, ఆమె కన్నీళ్ళను వేళ్ళతోనే తుడిచేస్తూ.

గ్లోరీ ఏడుస్తూనే ఉంది!

ఒకసారి స్మితకూడా ఎందుకో ఎవరి మీదనో చిరాకు పడింది.

"నీ ముఖం చిరాకు పడ్డానికి పనికిరాదు" అన్నాడు అమృతమూర్తి.

ఆ సంగతి ఇప్పుడు గుర్తు కొచ్చింది.

"ఏడవడానికి నీ ముఖం బొత్తిగా పనికిరాదు, సిస్టర్!" అన్నాడు అమృతమూర్తి.

గ్లోరీ ఏడుస్తూనే నవ్వి, నవ్వుతూనే ఏడుపును దిగమింగుకుంది. కళ్ళు తుడుచుకుంది. టైము చూసుకుంది. ఒకసారి పేషెంట్లందర్నీ చూసింది.

"మీరు నాకు తెలుసు. అక్కతో ఒకసారి నేను ఆస్పత్రి కొచ్చాను. అప్పుడూ మీరు 'ఐ సి సి యు' లోనే ఉన్నారు. అప్పుడు చూశాను. మీ గురించి అక్కయ్య అప్పుడప్పుడు చెబుతూ ఉండేది. మీ రిచ్చిన పలహా విన్నట్లయితే ఎలా ఉండేదో! విన్నది కాదు. దాని గ్రహచారం విననిచ్చింది కాదు. నేనూ

# 'సశేషం'

## రాళ్లూరి భరద్వాజ

చూసి, మళ్ళీ మళ్ళీ మళ్ళీ చూసి నిట్టూర్చాడు.

"మీ రేమీ అనుకోకండి. ఇదివరకు మిమ్మల్నెక్కడో చూశాను" అన్నాడు అమృతమూర్తి.

"ఎక్కడో చూసే ఉండవచ్చు. మీరు విశాఖలో కానీ చదివారా? మహారాణీపేటలో కానీ ఉన్నారా?" అన్నది సిస్టర్.

"లేదు" అన్నాడు అమృతమూర్తి. అని, "ఒకవేళ ఉంటే ఉన్నాననుకోండి—అప్పుడేమిటి?"

"మీ రక్కడ లేనే లేనప్పుడు—ఎందుగ్గాదు—నే నక్కడ చదువుకున్నాను" అన్నది సిస్టర్.

"విశాఖ నాకు తెలుసు. నా చదువంతా మద్రాసులో—ఆ రోజుల్లో నాతోబాటుగా చంద్రిక, శశి, భూషణం, సన్నగా, ఎత్తుగా, సగం జట్టతలతో వెదురులాగా వూగుతూ నడిచే కిష్టమూర్తి..."

"మీ రసలు మాట్లాడకూడదు. నేను వెళ్ళిపోతాను" అంటూ లేచింది గ్లోరీ.

"కూచోండి. ఇహ మాట్లాడను."

గ్లోరీ నవ్వింది. నవ్వి చూపుడు వేలు పెదవుల మీద ఉంచుకుని, మాట్లాడకూడదని సైగ చేసింది. అమృతమూర్తి కూడా పెదవుల మీద వేలుంచుకున్నాడు.

దూరంగా రోడ్డు మీద కారు చేసిన రొద—ఆ మూలగా ఉన్న పేషెంటు పెడుతున్న సన్నని గురక—గాలికి కిటికీ రెక్క కదిలినప్పటి చప్పుడు.

ఆ నిశ్శబ్దం మరీ భయంగా ఉంది. దుస్సహంగా

"మాట్లాడకండి! మీ కేమన్నా జరిగితే నా ప్రాణం మీదికొస్తుంది. నేనుంటే మీ రిలానే మాట్లాడుతుంటారు. వెడతాను."

గ్లోరీ లేచింది.

అమృతమూర్తి గ్లోరీ చేయి పుచ్చుకుని అదిమి కూచో పెట్టాడు. అతనేమీ అనుకోలేదు కానీ, అనుకోని ఆ పరిణామానికి గ్లోరీ బిత్తరపోయింది. ఎవరన్నా చూశారేమోనని అటూ ఇటూ చూసింది. అందరూ ప్రశాంతంగా నిద్ర పోతున్నారు. గ్లోరీ గాభరా పడడం చూశాక కానీ తాను చేసిన పొరపాటేమిటో అమృతమూర్తికి తట్టలేదు.

"సారీ!"

"ఫర్వాలేదు—మీరు నా తండ్రిలాంటి వారు" అన్నది గ్లోరీ.

అమృతమూర్తి ఉలికి పడ్డాడు.

"నీ పేరు స్మిత."

గ్లోరీ సన్నగా నిట్టూర్చింది.

"కాదు—కాదండీ! స్మిత మా అక్కయ్య."

"ఎంత మంచి అక్కయ్యనో—భగవంతుడు నీ కిచ్చాడు. అలాంటి వాళ్ళు వేయి క్కాడు సరికదా లక్షక్కొడా ఒక్కరుండరు. ఆ రెండు వారాలూ—నన్ను తండ్రిని చూసినట్టు చూసింది. తండ్రికన్నా మించి చూసింది."

"మీరు మాట్లాడకూడదు" అన్నది గ్లోరీ.

"ఇప్పు డెలా ఉంది?"

చెప్పానండీ! అమ్మ కూడా చెప్పింది. దాని మొండితల—దాన్ని— మీకు తెలుసు గదా— సురేందర్."

అమృతమూర్తి లోలోపల వెనక్కు వెనక్కు జరిగాడు. స్మిత—ఆవిడ తరచుగా తన గదికి రావడం, డ్యూటీ లేనప్పుడు తనూ, స్మితా పేకాట ఆడుకోవడం, తను చాతకాకా, ఆట రాకా వోడిపోవడం, స్మిత తనను గేలి చేయడం—అప్పుడే తాను సురేందర్‌ను గురించి వినడం...


"ఏమయింది?" అన్నాడు అమృతమూర్తి.

"వాడు దొంగ! బద్మాష్! రాస్కెల్! వాణ్ణి చూస్తూనే స్కౌండ్రల్ అని తెలిసి పోతుందాయె! ఈ పిచ్చి కుంకకు తెలియక పాయె! ఎందుకు నమ్మిందో తెలియదు. వాడెలా నమ్మించాడో కూడా తెలియదు. కాదంటున్నా, కూడదంటున్నా వాడితో తిరిగింది. వాడు మోసం చేస్తాడని నెత్తీ నోరూ కొట్టుకుని చెప్పానండీ! వినలేదు. ఆయిదారు మాసాలు వాడే లోకంగా తిరిగింది. తరవాత పెళ్ళి చేసుకుంది. పెళ్ళయ్యాక ఇద్దరూ దుబాయ్ పోతున్నా మన్నారు. ఇద్దరకూ అక్కడ ఉద్యోగాలు దొరికా యన్నారు. సంతోషించాం. సురేందర్‌ను గురించి పొరబాటుగా అనుకున్నందుకు బాధ పడ్డాను. హైదరాబాదు దాకా వచ్చి వాళ్ళను పంపించింది అమ్మ."

గ్లోరీ ఆగిపోయింది.

మళ్ళీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

దుఃఖాన్ని ఆపుకోవాలనుకుంటోందుగ్గాను కింది పెదవిని




బిగ పట్టింది.

జరగకూడని దేదో జరిగిందని అమృతమూర్తికి తెలుస్తూనే ఉంది కానీ, ఏం జరిగి ఉంటుందో ఊహించలేక పోయాడు.

"అక్కయ్యను అదే ఆఖరు సారిగా చూడడం! ఇంతవరకూ—" అని ఆగింది గ్లోరీ.

దూరంగా ఉన్న పేషెంటు లేచి దగ్గుతున్నాడు. గబగబా అతని దగ్గర కెళ్ళింది. గుండెను సవరించింది. ఇంకేవో మాత్ర లిచ్చి పడుకో పెట్టింది. ఈదురుగాలి రుయ్యిమంటూ వస్తుంటే, కిటికీ తలుపును సగం దాకా మూసి వచ్చి మళ్ళీ స్టూల్ మీద కూచుంది.


ఇప్పుడు కాస్త తేరుకున్నట్టుగా కనిపించింది గ్లోరీ.


"వాడు దొంగ వెధవ! రాస్కెల్! స్కౌండ్రల్! అక్కయ్యను వాడు బొంబేలో అమ్మేశాడు. అమ్మేశాడని చాలా కాలానిగ్గానీ తెలిసింది కాదు. అన్నయ్య వెళ్ళి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. లాభం లేకపోయింది. ఈ మధ్యనే—ఉండండి! ఇప్పుడే వస్తాను" అంటూ గ్లోరీ వెళ్ళి ఒక చిన్న సంచీని తెచ్చింది. "చూడండి!" అంటూ ఆ సంచీలోంచి మడిచిన ఒక పత్రికను తీసి అమృతమూర్తికి చూపించింది.

అవినీతిగా ప్రవర్తిస్తున్నందుకు పోలీసులు అరెస్టు చేసిన అర డజను మంది అమ్మాయిల్లోనూ అటునుంచి రెండవ 'బొమ్మ' స్మితది.

అమృతమూర్తి విలవిలలాడిపోయాడు.

"అన్నయ్య ఈ పత్రిక చూశాక, మళ్ళీ బొంబాయి వెళ్ళాడండి! ఈ పత్రికాఫీసులో విచారించాడు. పోలీసు స్టేషన్లో కనుక్కున్నాడు. రెండేసి వందలు జుల్మానా వేసి విడిచి పెట్టారుట. అంతే!




అంతకు మించి ఏ అమ్మాకీ తెలియలేదు" అన్నది గ్లోరీ.

అమృతమూర్తి మెలుచుకు పోయాడు. ముడుచుకు పోయాడు. కుంచుకుపోయాడు. కుంచించుకు పోయాడు.

మనిషి ఇలా తయారవుతున్నాడేం? తనను చూసి తానే భయపడుతున్నాడేం? తనను తానే మోసగించుకుంటున్నాడేం? తను జీవించాలని ప్రయత్నిస్తూనే, మరొకరు జీవించలేని పరిస్థితుల్ని సృష్టిస్తున్నాడేం? దూర దూర ప్రాంతాలకూ— పిశ్వాంతరాళాలకూ ఎగబాకుతూనే, తను ఉన్న భూమండలాన్ని విషమయం చేస్తున్నాడేం? కృత్రిమంగా జీవిని ఉన్న జీవ సంతతిని నిర్మూలిస్తున్నాడేం? శాంతి కావాలంటూనే అశాంతికి అంకురార్పణం చేస్తున్నాడేం? తనను తనే ప్రేమించుకుని, తనను తనే ద్వేషించుకుని, తనను తనే సంహరించుకుని, తనను తనే సర్వ నాశనం చేసుకుంటున్నాడేం? ప్రేమించడం, ద్వేషించడం, కలిసి పోవడం, విడిలి పోవడం, నమ్మించడం, మోసగించడం, ఆదరించడం, అవమానించడం, సృష్టించడం, ధ్వంసించడం వంటి సవాలక్ష విరుద్ధ లక్షణాలు ఒకే మానవునిలో ఒకే సమయాన ఎలా సహజీవనం చేస్తున్నాయి? ఈ ఆత్మహనన లక్షణం ఒక్క మానవునిలోనే ఉన్నదా? ఇతర ప్రాణికోటిలోనే కూడా ఉన్నదా? జీవజాలం లోనే ఉన్నదా? నిర్జీవాలలోకూడా ఉన్నదా? ద్రవ్యం— ఒకానొక దశలో ప్రదర్శించే లక్షణమే 'జీవం' అనుకున్నప్పుడు జీవిలో ఉండే లక్షణాలన్నీ ద్రవ్యంలోకూడా ఉండాలి కదా! అలా ఉన్నాయా? తెలియదు. తనను తాను నాశనం చేసుకునే లక్షణం ద్రవ్యాని కున్నదా? తెలియదు. లేదా అదీ తెలియదు.

ఈ మొత్తం సమాజమే ఒక కబేళాగా మారి పోయింది. ఇక్కడ మనిషి మాంసం కారుచౌకగా లభిస్తోంది!

"నిద్రోస్తున్నదా?" అన్నది గ్లోరీ.

అమృతమూర్తి "లేదే!" అన్నాడు. "నేనుకావీ కళ్ళు మూసుకున్నానా?" అనీ అన్నాడు గ్లోరీ వైపు అనుమానంగా చూస్తూ.

గ్లోరీ ఏదో అనబోయి నిట్టూర్చి, ఏమీ అనక పోతే బాగుండదనుకుని, గొంతు సరిచేసుకుని, "ఇవన్నీ అనకుండా ఉండవలసింది గదూ! ఆపుకోలేక పోయాను. అందులోనూ ఆత్మీయులైన వారు కనిపించినప్పుడు దాచుకోవడంకూడా కష్టమే!" అన్నది.

"నేను లేస్తాను!" అన్నాడు అమృతమూర్తి.

"వద్దు. పడుకోండి."

"నిద్ర రాదు" అన్నాడు అమృతమూర్తి.

"వస్తుంది. వచ్చేలాగా చూసుకోవాలి. పూర్తి విశ్రాంతి మీ లాంటి వారికి చాలా అవసరం."

'పూర్తి విశ్రాంతి' అన్న మాటను నొక్కి అంటున్నట్లుగా తోచింది అమృతమూర్తికి.

అతని కళ్ళలోనూ నీళ్ళు తిరిగాయి.

"మీకు తప్పకుండా తగ్గుతుంది. మీది చాలా ఫెయిర్ కేస్! బీటింగ్ బాగా ఉంది. టెంపరేచర్ లేదు. షుగర్ కంప్లెయింట్ లేదు. బి.పి. నార్మల్ కంటే కాస్త ఎక్కువగా ఉంది. రెండు మూడు రోజుల్లో అదీ తగ్గిపోతుంది!" అన్నది గ్లోరీ.

"ఇప్పుడు టైమెంత?"

"నాలుగు నాలుగూ ఒకటి" అన్నది గ్లోరీ నవ్వుతూ.

"ఇంకేం నిద్రపోను? బతుకంతా నిద్ర మత్తులో తూగిసలాడుతూనే ఉన్నాను. కాస్త ఇప్పుడన్నా మేలుకో నివ్వు" అన్నాడు అమృతమూర్తి.

గ్లోరీ ఒకే ఒక క్షణం ఆలోచించింది. ఆలోచించాక పసుపు పచ్చని బిళ్ళలు రెండుబలవంతాన మింగించింది.

"ఈ దిక్కుమాలిన మందులు మింగలేకా సూదుల పోట్లు భరించలేకా చచ్చిపోతున్నాను" అన్నాడు అమృతమూర్తి విసుగ్గా.

లేచి వెళ్ళబోతున్న దల్లా ఆగి హాయిగా, నిర్మలంగా, తెల్లగా నవ్వింది గ్లోరీ.

"చావు కోసం కాదు డాక్ టాట్ మూర్తిగారూ! బతకడం కోసమే మందులు. మిగిలిన వాళ్ళందరూ హాయిగా నిద్ర పోతున్నారు కదా మరి మీరా రేమో"

ఈ చివరి మాటలు అమృతమూర్తికి వినపడనే లేదు. ఆసరికే అతనికి తీయని ద్రవ పదార్థమేదో మెల్లగా శరీరాన్నంతా ఆవరించినట్లూ, చల్లబరిచినట్లూ—నట్లూ నట్లూ నట్లూ అనిపించింది. ఇక్కడినుంచి మరొక చోటులోకి చేరుకున్నట్లనిపించింది.

అమృతమూర్తి కలా అనిపించినట్లు గ్లోరీకి తెలియదు.

● ● ● ●

"అరె! మీ రింకా ఉన్నారే!"

"మీ కోసమే చూస్తున్నాను" అన్నాడు వివేకానందం

"అసలు నా కక్కడకు వెళ్ళాలనికూడా లేదండీ! కానీ ఏం లాభం చెప్పండి? వెళ్ళక తప్పదం లేదు. అక్కడున్నంత కాలం చిత్రమేమిటంటే మీరొకరు ఇక్కడున్నట్లుకూడా గుర్తుకు రాకపోవడం! మీతో నేను అబద్ధాలాడలేను. నిజంగా మీరునాకు జ్ఞాపకమే రాలేదు" అన్నాడు అమృతమూర్తి.

"పోనీండి!"

అమృతమూర్తి తనలో తనే ఏదో అనుకున్నాడు. అనుకొనీ, అనుకొనీ ఒకసారి తల పైకెత్తి, "బాబు గారూ!" అన్నాడు మెల్లగా.

వివేకానందం 'ఏమి' టన్నట్లుగా కళ్ళెగరేశాడు.

"ఒక సత్యాన్ని తెలుసుకోవడం కోసం మనకున్న సాధనాలు జ్ఞానేంద్రియాలే నన్నారు. ఈ అవయవాలు అల్పమైనవి కనక, ఇవి అందించే సమాచారం కూడా అల్పమైనదే నన్నారు. అందువల్ల ఈ అల్పమైన అవయవాల మీదనే మనం పూర్తిగా ఆధారపడకూడ దన్నారు. అంతే కదండీ?" అన్నాడు అమృతమూర్తి.

(సశేషం)

# 'సశేషం'

పెద్ద కథ

రావూరి భరద్వాజ

(క్రిందటి సంచిక తరువాయి)

"మొత్తంమీద అంతేగానీ— దీని కొక చిన్న సవరణ కూడా ఉంది. తొలి దశలో ఆధార పడక తప్పదు. బీజంలో నిక్షిప్తమయి ఉన్న జీవశక్తి మొలకగా రూపు దిద్దుకొంటున్నప్పుడు బీజంలోనే ఉన్న ఆహారం మీద ఆధారపడినట్టుగా మాత్రమే మనంకూడా ఇంద్రియాల మీద ఆధారపడాలి. ఒక్క ఆశయ వాశే కాదు. మన కున్నవన్నీ అల్పమైనవే, అల్పతరం! తలుచుకొంటూ ఉంటే ఒక్కోసారి ఎంత దుఃఖం కలుగుతుందని! ఇంత సంపత్సమృద్ధి మయిన ఈ విశ్వంలో మనం ఇంత పేదగా ఎందు కుంటున్నామో తోచదు. నీ ఆలోచనలనూ, నీ భావాలనూ, నీ అనుభూతులనూ ఎదుటి వారికి తెలియజేసేందుకు నీకున్న సాధనం భాష! నువ్వేం ప్రయత్నించు, గుంజుకో, రుంజుకో, ఉరేసుకో— నీ వనుకొన్న వాటన్నింటినీ, అనుకొన్నంత శక్తి మంతంగా, యథాతథంగా నీ వనుకొన్న ధోరణిలో భాష ద్వారా అభివ్యక్తం చేయలేవు. అలా చేయలేవు గనకనే — చేయాలన్న పట్టుదల నీకున్నది గనకనే అనేక ఉదాహరణలనూ, ప్రతీకలనూ ఇచ్చుకొంటూ పోతావు. ముఖభంగిమలనూ, సైగలనూ తోడు తెచ్చుకొంటావు. ఇంతకుముందు కూడా ఒకటి రెండు సందర్భాలలో ఇదే చెప్పబోయాను. మన కున్న భాషా సంపద తక్కువ. దాని శక్తి కూడా తక్కువే! ఈ తక్కువ శక్తిగల దానిద్వారా ఎక్కువ పనులు చేయించా లనుకోవడం సాహసం. ఈ సాహసం విజయవంతం కావాలంటే మనం కొత్త పదాలను సృష్టించుకోవాలి. కొత్త సంకేతాలను ఏర్పాటు చేసుకోవాలి. ఒక చిన్న వాక్యం ద్వారానో, లేదా సుదీర్ఘమైన వాక్యం ద్వారానో నీవు చెప్పలేని విషయాలను కొత్త సంకేతాల ద్వారా చెప్పగలగాలి. అందుకోసం నూతనమైన చిహ్నాలను నీవు రూపొం దించుకోవాలి. అలాంటి దేదో జరిగితే తప్ప— కొన్ని కొన్ని విషయాలను — అందులోనూ మృత్యువు, సత్యం, దైవం, జ్ఞానం, వివేకం వంటి విషయా లను— పూర్తిగా అర్థమయ్యేలాగా చెప్పడం సాధ్యం కాదు. చిత్రమేమిటంటే, ఈ సాధ్యం కాకపోవడ మన్నది వీటిని గురించి చెప్పవలసి వచ్చిన ప్రతిసారీ మానవునికి ఎదురు పడుతూనే ఉన్నది. మన భాష, మనమూ— సరే. ఏ భాషలోనైనా, ఏ కాలంలోనైనా సంపూర్ణంగా చెప్పిన రుజువులు లేవు. కాకపోతే, మనకన్నా కొంత మెరుగ్గా ఉండవచ్చు. అంటే— ఏమిటంటే— ఈ విషయాలు అభివ్యక్తీకరణకు అతీతమైనవనీ, అనుభవైక వేద్యాలనీ తేలుతున్నది" అన్నాడు వివేకానందం.

"నిజమేనండీ!" అన్నాడు అమృతమూర్తి.

"నా మట్టుకు నాకు ఎన్నో అనుమానా లున్నాయి. అవన్నీ నన్ను గిలకొడుతూనే ఉన్నాయి. వాటికి సమాధానాలు చెప్పుకోవాలి. నా అనుమానా లేమిటో నాకు తెలుసునండీ! కానీ, నాకు తెలిసినదాన్ని చెప్పడం మాత్రం నాకు తెలియడం లేదండీ!" అన్నాడు అమృతమూర్తి.

"ఆ ఇబ్బంది ఎప్పుడూ ఉంటాయి. అలాగని, మనం చేతులు ముడుచుకు కూచోలేము. అలా కూచో కూడదు కూడా. చెప్పుకోగలిగినంతవరకూ మనం చెప్పుకొందాం. తెలియని వాటిని తెలిసిన వారి నుండి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాం" అన్నాడు వివేకానందం.

"మీరు నా కన్న తెలిసినవారు గనక నా అనుమా నాన్ని రహితం చేయండి. మనవారు తరచుగా 'జన్మ రాహిత్యం — జన్మరాహిత్యం—' అంటూ ఉంటారు. దాన్ని గురించి తెలుసుకోవాలని ఉన్నది" అన్నాడు అమృతమూర్తి.

"అలా ఉండడం — ఆరోగ్యానికి చిహ్నం. ఒక ప్పుడు నాకూ ఇలాంటి అనుమానాలే ఉండేవి. వాటిని నేను చాలా కాలం పాటు మనసులోనే ఉంచు కొన్నాను—పైకి చెబితే నవ్వుతారేమోనని నా భయం. కొంతకాలం దాకా ఏ ఇబ్బందీ కలగలేదుగానీ — ఆ తరవాత ఈ సందేహాలు నన్ను పీడించుకు తిన సాగాయి. ఈ పీడ నుండి విముక్తికోసం నేను తత్త్వానందుల వారిని ఆశ్రయించాను. వారి బోధన లలో నాకు శాంతి లభించింది" అన్నాడు వివేకానందం.

'చెప్పండి!' అన్నట్టు చూశాడు అమృతమూర్తి.

"మళ్ళీ అదే సమస్య! భాషా సమస్య! అభివ్యక్తీ కరణ సమస్య! నేను చెప్పదలచుకొన్నదంతా చెప్ప లేను ... ఇక్కడే మరో సంగతి గుర్తుంచుకోవటం మంచిది. స్వామి తత్త్వానందుల వారు నాకీ విషయా లను చెప్పడానికి ఉపక్రమించినప్పుడు, తాముకూడా చెప్ప దలచుకున్నదంతా చెప్పలేకపోతున్నామన్నారు. నేనూ అదే మాటను ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నాను. తత్త్వానందులవారు నాకు చాలా లోతుగానూ, విశదంగానూ చెప్పారు. వారు చెప్పినదంతా నాకు అవగాహన కాలేదు. నా కవగాహన అయినదాంట్లో చాలా కొద్దిభాగం మాత్రమే నీకు చెప్పడానికి నా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాను... అసలు విషయానికీ, నీ దగ్గరకు చేరే విషయానికీ మధ్య ఎంత అంతరం ఉంటుందో దీన్నిబట్టి నీవు గ్రహించ వచ్చు" అన్నాడు వివేకానందం.

అమృతమూర్తి తల పంకించాడు.

"వాంఛ— అన్నింటికీ మూలమని పెద్దలు చెబుతున్నారు. వాంఛ ఉన్నంతకాలం, దాని ఫలితా లను అనుభవించ బుద్ధి పుడుతుంది. అలా అనుభ వించడంకోసం శరీరం కావాలి ... నేను చెప్పదలచు కొన్నదాన్ని ఒక ఉదాహరణ ద్వారా చెప్పడానికి ప్రయత్నిస్తాను... అగ్ని ప్రమాదం జరిగింది. ఇల్లు కాలిపోతూ ఉంది. ఆ ఇంటి నించి మనం అందినంత వరకూ సామాను తెచ్చుకొంటాం. ఇంటినిండా పుష్కలంగా రకరకాల సామానులూ ఉన్నాయి. వాటిలో నించి ఏవి మనం ముందుగా తెచ్చు కొంటాం?"

"మన కిష్టమైన వాటిని ముందుగా తెచ్చు కొంటా మండీ!" అన్నాడు అమృతమూర్తి.

"సరిగ్గా చెప్పారు ... మన ఇష్టానిష్టాలను అప్పటికప్పుడు బేరీజు వేసుకొనీ, అవకాశాన్ని చూసు కొనీ సామాన్లు బయటికి తెచ్చుకొంటాం. వీలు పడితే — పాత చీపురు కట్టను కూడా పోనివ్వంగదా! ఈ శరీరం కూడా దగ్ధమవుతున్న ఒక గృహం వంటిదే! మనం కోరుకున్న వాటి నన్నింటినీ, మన కిష్టమైన వాటి నన్నింటినీ మూటగట్టుకొని, ఆ మూటను మోసుకొంటూ కొత్త కొంపకు చేరు కొంటాం. అక్కడ సర్ది వేస్తాం. అసలు—మనం— ఏమీ కోరుకోలేదనుకోండి. మనకేమీ అవసరం లేదనుకోండి. అప్పుడు—మనం — తెచ్చుకోవలసింది కూడా ఏమీ ఉండదు. మా వెంట ఏమీ లేనప్పుడు మా కొక ఇల్లు మాత్రం ఎందుకు చెప్పండి? కేవలమూ అనవసరమే గదా! సామానులు లేనప్పుడు ఇంటి అవసరం లేనట్లే, కోరికలు లేనప్పుడు శరీరం అవసరం కూడా లేదు. అంటే — పునర్జన్మ అవసరం లేదన్నమాట. దీన్నే తాత్త్వికులు 'జన్మ రాహిత్యం' అంటున్నారు. ఈ స్థితిని పొందడానికి మనం వాంఛించవలసినది వాంఛా రాహిత్య స్థితిని. అంటే శూన్యాన్ని. కోరిక ఉంటే తప్ప శరీరం అవసరం లేదు. కోరిక లేనివాడికి శరీరం ఉండడం అదనపు భారమే అవుతుంది. మనం కోరుతున్నది ఏమీ లేని శూన్యాన్ని గనక మనకు శరీరం అవసరం లేదు. శరీరం అవసరం లేదు గనక ఇంకో జన్మకూడా అవసరం లేదు" అన్నాడు వివేకానందం.

"సాధారణ సాధకుడు ప్రారంభ దశలో శూన్యాన్ని భావించడం సాధ్యమవుతుందంటారా?" అన్నాడు అమృతమూర్తి.

"లేదండీ! ఒకవేళ ఏ సాధకుడయినా ప్రారంభం నుండీ శూన్యాన్ని భావించ గలిగితే, అతను ఆరితేరిన వాడవుతాడు గానీ సామాన్య సాధకుడు మాత్రం కాడు ... మనస్సును — ఒకేచోట కేంద్రీకృతం చేయడంకోసం మనస్సుకు నచ్చిన ఒక దృశ్యాన్ని




ఎదురుగా ఉంచుకోవచ్చు. ఏ దృశ్యాన్ని ఎదురుగా ఉంచుకోవడమన్నది నీ సంస్కారాన్నిబట్టి, నీ అవసరాన్ని బట్టి నీవే నిర్ణయించుకో... కుర్రాడికి అక్షరాలు నేర్పాలి. అందుకోసం ఒక బొమ్మను చూపుతాం. ఆ బొమ్మ కింద అక్షరాలలో బొమ్మ పేరు రాస్తాం. రాశాక పలికిస్తాం. ఇలా అక్షరాలన్నీ కుర్రవాడికి వచ్చాక — ఇక బొమ్మలతో పనిలేదు. ఈ అక్షరాల ద్వారా చిన్న చిన్న మాటలు, ఈ మాటల ద్వారా వాక్యాలు, ఈ వాక్యాల ద్వారా ... గ్రంథపఠనం, ఈ పఠనం ద్వారా జ్ఞానలబ్ధి — ఈ దశ కొచ్చాక అక్షరాలు కూడా అనవసరమే అవుతాయి. ముందుగా బొమ్మలు, ఆ తరవాత అక్షరాలు, పదాలు, వాక్యాలు, గ్రంథాలు— ఇవన్నీ రాలిపోతాయి. వీటి ద్వారా లభించిన జ్ఞాన సంపద మాత్రం మిగిలిపోతుంది. అలాగే ధ్యాన మార్గంలో కూడా — తొలి దశలో ఈ విగ్రహాలు ఆరాధనలు, పూజలు అవసరమవుతాయి. ఒక ఉత్తమ స్థితిని చేరుకోవడానికి ఇవి సాధనాలుగా ఉపయోగపడతాయే తప్ప ఇవే "ఉత్తమ స్థితి" మాత్రం కావు. ఈ సాధనాల సహాయంతో మనం లక్ష్యాన్ని చేరుకోవాలి. చేరుకున్న తరవాత సాధనాలను పరిత్య

జించాలి. జన్మరాహిత్యమనే ఉత్తమ స్థితి నీవు చేరుకోవడానికి నీక్కావలసిన కనీసార్హత నీకే కోరికలూ లేక పోవడమే! వాంఛలు లేవు గనుక, ఆ వాంఛలను తీర్చుకోవడానికి శరీరమూ అవసరం లేదు, శరీరం అవసరం లేదు గనక— మరొక జన్మ ఎత్తవలసిన అవసరమూ లేదు. జన్మ రాహిత్య స్థితిని అందుకోవడానికి ఇదే మార్గమని స్వామి తత్త్వానందుల వారు నాకు బోధించారు'' అన్నాడు వివేకానందం.

• • • •

అంతదాకా నిశ్శబ్దంగా ఉన్న ఆ హాలు నిండా బాధాకరమైన మూలుగు బరువుగా వ్యాపించింది. డాక్టర్లు, నర్సులు, ఇతర పని వాళ్ళు అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు.

''ఏమయింది?''

''ఏం జరిగింది?''

''ఎవరికి?''

''ఎప్పుడు?''

అందరూ తలో ప్రశ్న అడుగుతున్నారు. అడిగేవారే తప్ప జవాబు లిచ్చే వారు మాత్రం కనపడడం లేదు.

అమృతమూర్తి కూడా మెల్లగా తల తిప్పి చూశాడు. తన కెదురుగా ఉన్న బెడ్ చుట్టూ డాక్టర్లు, నర్సులు మూగి ఉన్నారు.

''ఏమయింది?'' అన్నాడు ఆర్. యం. వో ఆదుర్దాగా.

''ఇప్పటిదాకా బాగానే ఉన్నాడు. హఠాత్తుగా మూలగడం మొదలెట్టాడు'' అన్నాడు డాక్టర్.

ఇద్దరు పనివాళ్ళు ఆక్సిజన్ సిలిండర్ తీసుకొచ్చారు. సిస్టర్ పేషెంట్‌కు ఆక్సిజన్ అందిస్తున్నది. కుమార్. గుండెమీద బలంగా నొక్కి రుద్దుతున్నాడు. రోగి పక్కమీద స్థిమితంగా ఉండలేక పోతున్నాడు తల అటూ ఇటూ తిప్పుతున్నాడు. రెండు చేతులూ గుండె కేసి కొట్టుకుంటున్నాడు. బాధతో గిలగిల లాడిపోతున్నాడు. ఏదో భయంకరమైన పట్టునుండి విడిపించుకునేందుకు పెనుగు లాడుతున్నాడు. పసి బిడ్డలాగా కాళ్ళు కొట్టుకుంటున్నాడు. ఊపిరాడక గిజగిజ లాడుతున్నాడు. ఎవరో గొంతు నులుము తున్నట్టు విలవిల లాడిపోతున్నాడు.

అందరూ ఆతృతగా రోగిని చూస్తున్నారు.

డాక్టర్ నుదుటు మీద చిరు చెమట.

సిస్టర్ ఆక్సిజన్ ఇస్తూనే ఉంది.

మరో సిస్టర్ ఇంజక్షన్ చేస్తూనే ఉంది.

డాక్టర్ గుండెను బలంగా లదుముతూ, ఉష్ణ్నంగా కృత్రిమ చలనం సృష్టించడానికి ఏవో శక్తితో లటాలు పడుతూనే ఉన్నాడు.

ఏం జరిగిందో తెలీదు.

చూస్తూ చూస్తూ ఉండగానే కాళ్ళు కొట్టు కోవడం ఆగిపోయింది.

చేతు లాడించడం ఆగిపోయింది. అటూ ఇటూ తల తిప్పడం ఆగిపోయింది.

గిలగిల లాడడం ఆగిపోయింది.

విలవిల లాడడం ఆగిపోయింది.

గిజగిజ లాడడం ఆగిపోయింది.

పెనుగు లాడడం ఆగిపోయింది.

సిస్టర్ ఆక్సిజన్ ఇవ్వడం ఆగిపోయింది.

డాక్టర్ గుండెను నొక్కడం ఆగిపోయింది.

అమృతమూర్తి ఆ బెడ్ వేపు చూశాడు.

నిన్న సాయంత్రం కూడా ఆ రాజుగారు తన దగ్గర కొచ్చి కూచున్నారు. కూచుని మంచి మంచి కబుర్లు నవ్వుతూ పేలుతూ చెప్పారు.

ఆయనగారి తండ్రి చిన్నప్పుడే చనిపోయాడట. తండ్రి చనిపోయాక పెద నాన్నలూ, చిన నాన్నలూ కలిసి కుట్ర చేసి, తన తల్లికి వాటా లేకుండా చేశారట. ఇక్కడే ఉంటే ఏ నాటికయినా ప్రమాదం కనక ఉండకూడ దనుకున్నారుట. అనుకొని గంపెడు అభాండాలూ, అపవాదులూ నెత్తిన వేసి పుట్టింటికి తరిమేశారుట!


''మా తాత, అమ్మమ్మ ఉన్నంత కాలం మా అమ్మకు బాగానే జరిగిందండీ! నా మేనమామలకు పెళ్ళిళ్ళయ్యాయి. పెళ్ళాలు కాపరాల కొచ్చారు. వాళ్ళకూ, మా అమ్మకూ పడలేదు. ఆ ఇంటి నించి వచ్చేసింది. ఆ పూటనే ఇంకో అయ్య పంచన చేరింది నా కింకా చిన్నతనమే ననుకోండి. అయినా కొన్ని కొన్ని సంగతులు నే నిప్పటికీ మరిచిపోలేనండీ. ఒకసారేం జరిగిందంటే...'' అంటూ రాజుగారు ఆ జరిగిన సంగతు లన్నీ చెప్పుకొచ్చాడు.

రాజుగారికి అనే బాపిరాజుగారికి, తన చిన్నతన మంతా జ్ఞాపకముంది. తనను జువ్వి చెట్టు కింద

సముద్రగర్భంలో రాక్షసచరాలు



కథాకల్పన
యండమూరి వీరేంద్రనాథ్
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో
వచ్చేవారమే ప్రారంభం!
చిత్రాలు
అమర్ - మోహన్




కూచో పెట్టి, ఆడుకోవడానికి పొట్టిబొమ్మ లిచ్చి, తన తల్లి పొలం పని చేయడాన్ని గురించి ఆయన కళ్ళకు కట్టినట్టుగా చెప్పాడు. తనకు కడుపు నిండా అన్నం పెట్టి, తన తల్లి పస్తులు పడుకున్న రోజుల్ని కూడా ఆయన దాచుకోలేదు.

"మా మేనమామలంది ఆ వూరే అయినా వారు ఎప్పుడూ నన్ను ఆదరంగా చూసిన పాపాన పోలేదండీ! పలకరిస్తే వెంట పడతా మేమోనని తప్పుకు తప్పుకు పోతూ ఉండేవాళ్ళు. నాకు బాగా జ్ఞాపకం ఉంది, సార్! ఒక దీపావళి పండక్కి అందరూ టపాసులు కాలుస్తున్నారు. నాకూ కాల్చాలనే ఉంది. మా అమ్మ రెండు అణాలు నా చేతిలో పెట్టిందండీ! నాకు జిల్లీలు కాల్చాలనీ, తూటాలు కాల్చాలనీ మహా సరదాగా ఉండేది. రెండణాలకేం వస్తాయి చెప్పండి? కుతిని చంపుకోలేక తూటాలు కాలుస్తున్న పిల్లల దగ్గర కెళ్ళి చూస్తున్నాను. ఒక కొంటెనా కొడుకు రెండు జిల్లీలు కాల్చి, నా మీదికి విసిరాడండీ! ఒకటి నా మెడను తాకుతూ పోయిందండీ. రెండోది నా చొక్కాలో జారబడి ఎదురొమ్మంతా తూట్లు పొడిచిందండీ! నేను చచ్చిపోయాననే అంతా అనుకున్నారండీ! మొండి సచ్చినోణ్ణి. బతికాను. నన్ను బతికించడానికి మా అమ్మ పడిన పాట్లు ఇన్నీ అన్నీ కావండీ! అప్పుడైనా నా మేనమామలు నన్ను కానీ, మా అమ్మను కానీ పలకరించ లేదండీ!" అన్నాడు బాపిరాజు.

చొక్కా పైకి తీసి, జిల్లీ పొడిచిన తూట్ల మచ్చలనుకూడా చూపించాడు.

ఆయన చిన్నప్పుడు తాటిముంజ లమ్మాడు. తరవాత సోడాబండి తిప్పాడు. రెండేళ్ళ తరవాత చిన్న కూల్‌డ్రింక్ షాపు పెట్టాడు. ఆ షాపుకు దగ్గర లోనే తన తల్లి చేత మిఠాయి కొట్టు పెట్టించాడు. ఈ పని చేస్తున్నందుకు తమకు తలలు కొట్టేసినట్టుగా ఉన్నదని మేనమామలు కబురు చేశారు.

"మీకూ, నాకూ ఏం సంబంధ ముంది? మీ రెవరో నాకు తెలియదు. నే నెవరో తెలుసుకోవలసిన అవసరం మీకు లేదు. నేను సోడాకొట్టు పెట్టుకోవడం మీకు అవమానంగా ఉన్నదా? పొద్దస్తమానం మీ రా పొలాల్లో పడి కొట్టుకోవడం నాకూ అవమానంగానే ఉంది. మీ రా పని మానుకుంటారా? లేదు కదా! నేనూ ఈ పని మానుకోను" అని బాపిరాజు కబురు చేశాట్ట.

బాపిరాజుగారు స్పష్టంగా చెప్పలేదు కానీ ఆ తరవాత ఆయన సారాకొట్టు పెట్టాడు. ఆ కొట్టుకు లైసెన్సు సంపాదించడం కోసం ఆయన కాస్త "పెద్ద మొత్తమే" ఖర్చు చేశాడు. అలా చేయడానికి ముందు బాపిరాజుగారి తల్లి లబలబ లాడిపోయింది. ఉన్నదంతా ఖర్చు చేసినా, పని కాకపోతే మళ్ళీ 'అ ఆ' ల దగ్గరినుంచీ మొదలెత్తుకోవాలని ఆవిడ భయపడింది.

"అయినా నేను వినలేదండీ!" అన్నాడు బాపిరాజు.

అనుకున్న దానికన్నా ఎక్కువగానే 'ఖర్చు చేశాడు బాపిరాజు. చేసి పనిని సాధించాడు. మిగిలిన వారందరి కన్నా ఆయన ఎక్కువ లాభాలు సంపాదించాడు.

మూడేళ్ళు గిర్రున తిరిగేసరికి బాపిరాజుగారి ప్రతిభ దినదినానా వెలిగ సాగింది. ఆయనగారు రెండో సంవత్సరంలో తాలూకాలోని సారా కొట్లన్నీ పాడేశాడు. మూడో సంవత్సరంలో — జిల్లా మొత్తం ఆయన చేతికింది కొచ్చింది. ఈ పనులన్నీ సజావుగా సాగి పోవడానికి ఆయన తనకొచ్చిన లాభాలన్నీ "ఖర్చు" చేశాడు. ఈ ఖర్చు చేయడం వల్ల ఆయనకు చాలా పనరులు అందుబాటులో కొచ్చాయి. జిల్లాస్థాయి లోనూ, రాష్ట్ర స్థాయిలోనూ ఉన్న నాయకులు చాలామందితో ఆయనకు దగ్గరి సంబంధా లేర్పడ్డాయి. అధికారవర్గం ఆయనతో ఎప్పుడూ 'మంచి' గానే ఉండేది. ఈ అండదండలు చూసుకొని ఆయన తన పలుకుబడినీ, పెట్టుబడినీ పెంచుకున్నాడు. అచ్చంగా ఆయనకోసం ఏపనైనా చేసిపెట్టే ప్రజా ప్రతినిధులు హైదరాబాద్‌లోనూ, ఢిల్లీలోనూ కొందరున్నారు.

ఆయన కయితే రాజకీయాల్లోకి రావాలని లేనేలేదు. కానీ ఆ నియోజకవర్గంలోని ప్రజలు బలవంతం చేయడంవల్ల — ఆయన దేశసేవకూ, ప్రజా సేవకూ పూనుకోక తప్పలేదు. భారీ ఎత్తున విరాళాలిచ్చి పార్టీ టిక్కెట్టు సంపాదించాడు. అంతకు పది పదిహేను రెట్లు ఖర్చుచేసి, ప్రత్యర్థి కన్నా 11 వేల 4 వందల 32 వోట్ల ఆధిక్యతతో గెలిచాడు.

"ఎన్నికలకు ముందు నా మీద చాలా చెడ్డ ప్రచారం జరిగిందండీ! నేను దొంగసారా అమ్ముతాననీ, కల్తీ సారా అమ్ముతాననీ ప్రచారం చేశారండీ! అక్కడెక్కడో — ఏదో తిరనాళ్ళకో — అలగా ముండాకొడుకులు నానా మురుగు నీళ్ళు తాగి చచ్చారు చూడండీ. దానికి నేనే కారణమని కాగితాలు పంచిపెట్టారండీ! ఉపన్యాసా లిచ్చారండీ! గోడల నిండా రాశారండీ! కాకిగోల పెట్టారండీ! ఏం చేస్తేనేమండీ, బాబూగారూ — చివరకు సత్యమే గెలిచిందండీ!" అన్నారు బాపిరాజుగారు.

ఈ మధ్యలో ఆయన వజ్రం వంటి వాక్కుల్లాంటి పరమ సత్యాలు కూడా కొన్ని బయట పెట్టారు.

"వ్యాపారంలో నీతి వ్యాపారం, అవినీతి వ్యాపారం లేదు. ఉన్నదంతా వ్యాపారమే" అన్నా రొకసారి.

"సారాలో కల్తీ అంటే నాకు మండుకొస్తుంది. అసలు దేశమే పెద కల్తీ సరుగ్గా తయారయితే— మీరు సారా కల్తీ, నూనె కల్తీ అంటే నే నొప్పుకోను" అన్నారు.

"ఎవటి వాడి అవసరాలు మనం తీర్చాలి. మన అవసరాలు వాడితో చెప్పుకోవాలి. దీన్ని 'పరస్పర సహకారం' అనాలిగానీ, లంచ మివ్వడ మని చస్తే అనకూడదు" అన్నారు ఇంకోసారి.

"డబ్బు కిప్పుడు నా కేలోటూ లేదండీ — మీ దయవల్ల!" అన్నారు బాపిరాజుగారు.


ఆయనకు మూడు చిన్న తరహా పరిశ్రమలూ, ఒక లారీ సర్వీసూ, మూడు బస్సురూట్లూ, ఒక పెద్ద హోటలూ, రెండు బార్లూ ఉన్నాయి.

"మొత్తం ఆరుగురు పిల్లలండీ! నలుగురు మగ నలుసులు, ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేశాను. అల్లుళ్ళు కట్నాలు అడగలేదు. నే నివ్వనూ లేదు. చెరొక బారులోనూ అర్ధరూపాయి వాటా లిచ్చాను. ఇద్దరూ మా ఇంట్లోనే ఉంటున్నారు. నలుగురు మగపిల్లల్లోనూ ముగ్గురుకు పెళ్ళిళ్ళయ్యాయండీ! ఆ సన్నాసి నాయాళ్ళు నా మాట వినకుండా కట్నాలు పుచ్చుకొని, నా పరువు తీసేశారండీ! ఆఖరు వాడు — అమెరికాలో ఆటో మొబైల్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. వచ్చే ఏడాది ఇండియా కొస్తాడు. రాగానే ఒక చిన్న వర్క్‌షాపు పెట్టింతా మనుకొంటున్నాను. మా మేనమామల పొలమే తీసుకోండి — మార్కెటు ధరకన్న ఎకరానికి వేయి రూపాయలు ఎక్కువిచ్చి ఆరెకరాలూ కొని ఉంచాను ... అలగా ముండాకొడుకులు — కాస్త జాగా కనబడితే చాలు బాబుగోరూ— దయ్యమని గుడిసె వేసుకొంటారు. అందుకని చుట్టూరా కాంపౌండ్ వాల్ కట్టించేశాను. కాపలా పెట్టించేశాను. మా వాడు అమెరికా నుంచి వచ్చే వేళకు షెడ్లు కూడా పూర్తి చేయించి, మెషినరీకి ఆర్డరిచ్చి, అంతా సిద్ధంచేసి ఉంచుదా మనుకున్నాను ... అంతలోనే— పనేమీ లేనట్లు — ఈ సుస్తీ చేసింది... 'రేపో మాపో పంపించే ఏర్పాటు చూడండయ్యా, డాక్టరుగారూ, పదివేలు ఖర్చయినా సరే' అన్నాను ... డబ్బుకోసమని కాదుగానండీ— పని ఎర్కడప్పుడు ఈ రోగాలూ, రొష్టులూ వస్తే ఎంత చిరాకో చూడండి! నేను లేకపోతే — ఒక్క నిమిషం గడవదండీ! మూడు రోజుల్నుంచీ నన్నిక్కడ కైదులో పడేశారు" అన్నారు బాపిరాజుగారు దిగులు దిగులుగా.

హా రివన్నీ అన్నది కూడా సరిగ్గా నిన్న సాయంకాలమే!

గొంతు పెంచి అరుస్తున్నందుకు డాక్టర్లు అయినా, నన్నూ కోపగించుకోకపోతే, బాపిరాజు గారు ఇంకా చాలా చాలా విశేషాలు చెప్తూ ఉండేవారు.

(సశేషం)



# సశేషం



## రావూరి భరద్వాజ

(క్రిందటి సంచిక తరువాయి)

**నిమిషాని** కోసారి ఆయన వజ్రాల ఉంగరాలన్నీ తిప్పుకోవడమూ, మూడు పేటల రుద్రాక్ష మాలను పదేపదే కదిలించడమూ, అటూ ఇటూ తిరుగుతున్న నర్సుల వేపు అబగా చూడడమూ ఇంకా కళ్ళ ముందు నించి చెరిగి పోనేలేదు. ఇంకో గంటకో, రెండు గంటలకో ఆయన్ను ఆ బెడ్ మీది నించి తొలగిస్తారు. సాయంకాలానికో లేదా రేపటికో శ్మశానానికి చేరుస్తారు. అంతదాకా కూడాకూడా వెళ్ళిన ఆయన ఆత్మీయులందరూ ఆఖరుసారిగా ఆయనను చూసి, భోరుమని ఏడ్చేసి ఎవరి దారిన వారు వెడతారు. శ్మశానంలో ఆయన దాకా వెళ్ళేదీ, చివరిదాకా ఆయన్నే అంటి పెట్టుకుని ఉండేదీ వొంటి మీది గుడ్డముక్క తప్ప బహుశా ఇంకేమీ ఉండకపోవచ్చు.

కన్నార్పకుండా అటువేపే చూస్తూన్న అమృత మూర్తిని డాక్టర్ మందలించాడు. బాపిరాజు బెడ్ చుట్టూ స్క్రీన్ పెట్టించాడు. నుదుటి మీది చెమటను తుడచుకుంటూ ఇంకో పేషెంట్ దగ్గర కెళ్ళాడు.

"అలా ఉన్నారేం?" అన్నది గ్లోరీ.

"ఎలా?"

"భయంగా ఉందా?" అన్నది గ్లోరీ.

"లేదు."

కాస్సేపు అటూ ఇటూ తచ్చాడి మళ్ళీ బెడ్ దగ్గర కొచ్చి "భయపడ్డారా?" అన్నది గ్లోరీ.

"అలా కనిపిస్తున్నానా?"

"లేదు లేదులెండి! మీ కిది కొత్త కావచ్చుకానీ మాకు మామూలే! మొదట్లో నేనూ ఇవి చూడలేక కళ్ళు చిల్లులు పడేలాగా ఏడిచేదాన్ని. రానురాను అలవాటయి పోయింది. ఇవేవీ మనసులో పెట్టుకోకండి. వీటిని గురించి ఆలోచించకండి. కాస్సేపు కాస్సేపు కళ్ళు మూసుకోండి. నిద్ర పట్టేస్తుంది. ఈ జబ్బుకు మంచి మందు బాగా రెస్టు తీసుకోవడం!" అన్నది గ్లోరీ.

అమృతమూర్తి కళ్ళు మూసుకున్నాడు.

"కొంచెం చురుక్కుమంటుంది. చిన్న ఇంజక్షన్ ఇస్తాను."

పళ్ళన్నీ గిట్ట కరచుకుని, చేతిని సిస్టర్ కందించాడు అమృతమూర్తి. స్పిరిట్ రుద్దడం గుర్తున్నది. సూది గుచ్చడంకూడా గుర్తున్నది. అంతే.

• • • •

అమృతమూర్తి సాలోచనగా వివేకానందంగారిని చూశాడు. ఆ చూపుల్లో అనేక అనుమానాలు దోబూచులాడుతున్నాయి. తన కిలాంటి అనుమానాలున్నాయని చెప్పడానికి అమృతమూర్తి సంకోచిస్తున్నాడు. అతగాడు తటపటాయిస్తున్నాడని వివేకానందంగారికి సులువుగానే బోధ పడింది. గొంతు సవరించుకుని చెప్పడం ప్రారభించాడు.

"తత్వానందులవారు నాకు మరో విషయాన్ని కూడా చెప్పారు. ఈ విషయానికీ, ఇప్పుడు మనం మాట్లాడుకున్న విషయానికీ దగ్గర సంబంధాలున్నాయి. 'మరొక జీవితమంటూ ఉన్నప్పుడు కదా, మనం జన్మ రాహిత్యం కోరవలసింది. అసలు అటువంటి జన్మ ఉన్నదీ, లేనిదీ మనకు రుజువేమిటి? అని తత్వానందుల వారిని నేను ప్రశ్నించాను" అన్నాడు వివేకానందం.

"దానికి వా రేమన్నారండీ?" అన్నాడు అమృతమూర్తి ఆసక్తిగా.

"వారేమో చాలా చాలా చెప్పుకొచ్చారు కానీ అవన్నీ అంత వివరంగానూ, విపులంగానూ చెప్పడం నాకు చాత కాదు. వారు చెప్పిన దాని సారాంశం నాకు తెలిసినంతలో చెబుతాను" అని ఒక్క క్షణం ఆగాడు వివేకానందం. తరవాత మరోసారి గొంతు సవరించుకుని చెప్పడం ప్రారంభించాడు. "సర్వేంద్రియ విషయాలనూ మరిచిపోయి మనం నిద్ర పోతూ ఉంటాం. మన శరీరం ఇక్కడే, ఈ పక్కమీదనే ఉన్నది. కానీ మనం ఎక్కడెక్కడికో పోయినట్లూ, ఎవరెవరితోనో మాట్లాడినట్లూ, పోట్లాడినట్లూ కల గంటున్నాం. ఆ కలలో మనం నవ్వుతాం, ఆనందిస్తాం, దుఃఖ పడతాం. అసూయ పడతాం. కోపగించుకుంటాం. చిలిపిగా గంతు లేస్తాం, భయంతో కేక లేస్తాం అవునా? మెలకువ వస్తుంది. మనం మన పక్కమీదనే ఉంటాం. కానీ కలలో మనం అనుభవించిన వాటి ఫలితాలు ఈ యదార్థ లోకంలోనూ కనపడతాయి. ఉదాహరణకు భయం! మనం నిద్ర లేచినా, ఆ భయం తాలూకు చిహ్నాలు మన నించి ఇంకా దూరం కావు కొంత సేపటిదాకా! ఈ శరీరం ఇక్కడే ఉన్నది కదా— మనకు మరొక శరీరం ఎలా వచ్చింది? ఎవరిచ్చారు? ఎక్కణ్ణించి వచ్చింది? ఇప్పటి మన జీవితంతో పోల్చి చూస్తే, మన స్వాప్నిక జీవితం అతి స్వల్పం. ఆ స్వాప్నిక జీవితం మనం మేలుకున్న తరవాత 'మాయ' తోస్తున్నదే తప్ప కల గంటున్నంత సేపూ అది యథార్థమే కదా! ఇలాగే ఇప్పుడు మనం అనుభవిస్తున్నదికూడా స్వప్న జీవితమే నేమో! అప్పుడు మన యదార్థ జీవితం ఇంకేదో అయి ఉండాలి. ఆ జీవితం తాలూకు నిద్రలో, ఇప్పుడు మనం అనుభవిస్తున్న ఈ జీవితం ఒక కథలోని జీవితం కావచ్చు. మనం కల గంటున్నంతసేపూ అది కలగా మనకు తోచినట్లే ఇంకెక్కడో ఉన్న మన అసలైన జీవితం తాలూకు నిద్రలో వచ్చిన ఈ స్వప్నంకూడా మనం మేలుకున్న దాకా, కలగా మనకు స్ఫురించక పోవడం చాలా సహజం కాదా!" అన్నాడు వివేకానందం.

అమృతమూర్తి కళ్ళు విచ్చులు కొన్నాయి.

"మన్నించాలి" అన్నాడు అమృతమూర్తి కొంచెం ముందుకు జరిగి. "మీ రన్నదే నిజమయితే ఇది స్వప్నమని మన కెప్పుడు తెలుస్తుంది? ఎలా తెలుస్తుంది?"

"సరిగ్గా ఇదే ప్రశ్న నేనూ తత్వానందుల వారిని అడిగాను. దానికి స్వామివారు చిరుగా నవ్వుతూ చెప్పిన సమాధానం నా కింకా స్పష్టంగా గుర్తున్నది. వారన్న దేమిటంటే 'ఈ నిద్రా జీవితం లోంచి యదార్థ జీవితంలోకి కనులు తెరిచినప్పుడు తెలుస్తుంది. మేలుకున్నప్పుడు తెలుస్తుంది!' అన్నారు.


వివేకానందం చెప్పడం ముగించాడు. అమృతమూర్తి అతనికేసి ఆశ్చర్యంగా చూశాడు. విడ్డూరంగా చూశాడు. అలా చూశాక, తనను తానూ చూసుకున్నాడు.

• • • •

నటి: ఇహ తరవాత ఏం జరిగింది?

సూత్ర: ఇంతవరకూ జరిగిందాన్ని గురించి నీ వే మనుకున్నదీ చెప్పకూడ దనుకున్నావా?

నటి: అనుకోలేదు కానీ, చెప్పడానికి నా దగ్గర అనుమానాలు తప్ప మరేమీ లేవు. ఎవరో వివేకానంద వచ్చి, ఇంతసేపు ఆ సోది చెబుతూ కూచోడానికి డాక్టర్లు అనుమతించడమే నా కాశ్చర్యంగా ఉంది. రోగులకు విశ్రాంతి ముఖ్యమని చెబుతారు. ఇక్కడ—




మీ కథా నాయకుడు విశ్రాంతిగా ఉన్నదెప్పుడు చెప్పండి?

సూత్ర: ఇది 'అంతరంగం' లో జరిగిందని నేను చెప్పకపోతే నాది పొరపాటే! వివేకానందం ఎక్కడినుంచో రాలేదు. అమృతమూర్తిలోంచే వచ్చాడు. అలా రావడం చేయడం డాక్టర్ల వల్లకూడా కాదని మనవి చేసుకుంటున్నాను. అదీగాక...

నటి: ఆగండి! డాక్టరొస్తున్నాడు.

సూత్ర: మళ్ళీ చెప్పలేదని నన్ను నింద పెట్టకు—ఇది 'బహిరంగం' సుమా!

• • •

డాక్టర్‌గారొచ్చారు. ఆయనతోబాటే ధవళ కపోతాల్లాగా సిస్టర్లూ వచ్చారు. మంచం చుట్టూ ముసిరారు.

"ఎలా ఉంది?" అన్నాడు డాక్టరు.

"బాగానే ఉంది!" అన్నాడు అమృతమూర్తి.

"నిద్ర పట్టిందా?" అన్నాడు డాక్టరు.

అమృతమూర్తి మాట్లాడలేదు.

"ఇప్పటిదాకా తనలో తను ఏదో మాట్లాడుకుంటున్నట్లుగా, పెదవులు కదుపుతూనే ఉన్నాడండీ!" అన్నది సిస్టర్ గ్లోరీ.

డాక్టర్‌కు అనుమానం వేసింది. వేసి, స్టెతస్కోపుతో అమృతమూర్తిని పరీక్ష చేశాడు.

లబ్ డబ్.

లబ్ డబ్

లబ్ డబ్

"బాగుంది. తొందరగా కోలుకుంటున్నారు. నిన్నటికీ, ఇప్పటికీ మాంచి ఇంప్రూవ్‌మెంట్ కనపడుతూంది."

"థాంక్స్!" అన్నాడు అమృతమూర్తి.

"ఇంకో వారం లోగా మీరు ఇంటి కెడుదురు కాని!"

చేయెత్తి నమస్కరించ బోయి ఆ చేతికి సూదులు గుచ్చి ఉంచడం వల్ల గిలగిల్లాడి పోయి, నోటితోనే— "నమస్కారం" అన్నాడు అమృతమూర్తి.

డాక్టర్ తల మాత్రం పంకించి ధవళ కపోతాలతో సహా మరో బెడ్ దగ్గరకు వెళ్ళిపోయాడు.

డాక్టర్ వెళ్ళిందాకా అల్లంత దూరంలో ఉండి ఆ తరవాత దగ్గరగా వచ్చింది ఆశ. ఆవిడ కళ్ళ నిండా నీళ్ళు. ఆ నీళ్ళ వెనక సంతోషరేఖలు!

ఆశ కళ్ళల్లో నీళ్ళు నిలవడం ఇది రెండోసారి. ఆవిడ కళ్ళంటే అమృతమూర్తికి చాలా ఇష్టం. నవ్వడాకీ, నవ్వుతో మెరవడానికీ తప్ప నీటిపొరలు కమ్మడానికి ఆ కళ్ళు బొత్తిగా పనికిరావని అమృతమూర్తి విశ్వాసం! ఆ విశ్వాసానికి అనుగుణంగానే ఆవిడ కళ్ళల్లో నీరు ఊరకుండా జాగ్రత్త పడ్డాడతను—అది తన చేతుల్లో పని కనక! ఇప్పుడలా కాదు ఇది తన చేతుల్లోకూడా లేదు. ఆ నీళ్ళను సుతారంగా అద్దుదా మనుకున్నాడు. కాని లేవలేడు. లేచినా చేతిని అసలే కదపలేడు. ఆశను దగ్గరకు పిల్చి సున్నితంగా కనులద్ది, ఆమెను ఓదార్చినట్లుగా మనసులోనే అనుకుని అనుకున్నాక ఆశను చూశాడు అమృతమూర్తి.

"నేను ఉండనా?" అన్నది ఆశ.

"వద్దు. వెళ్ళు."

"రాహుల్‌ను పంపుతాను" అన్నది ఆశ.

"వద్దు. సత్యాన్ని పంపు."

"వెడతాను" అన్నది ఆశ.

అమృతమూర్తి 'సరే' నన్నట్టు తల తిప్పాడు.

కాని కాస్సేపటి దాకా ఆశ వెళ్ళలేదు. అమృతమూర్తినే చూస్తూ నిలబడింది. ఏదో పనున్న దానిలాగ మంచం మూడు పక్కలా తచ్చాడింది. దుప్పటి పాదాల మీదికి లాగింది.

"వస్తా" అంటూ మెల్లగా తలుపు దాకా వెళ్ళి ఇంకోసారి అమృతమూర్తిని చూసి బయటికి వెళ్ళిపోయింది ఆశ.

ఆ తలుపు వేపే చూస్తూ ఉండిపోయాడు అమృతమూర్తి. ఇప్పుడతని కళ్ళల్లో సన్నని నీటి జీరలు. తుడుచుకుందుకు చేతులుకూడా కదపలేని నిస్సహాయ స్థితి.

"సిస్టర్!" అన్నాడు అమృతమూర్తి మెల్లిగా.

గ్లోరీ వచ్చింది, అంతకన్నా మెల్లిగా.

"గండం గడిచాక, ఇప్పుడిదేమిటి?" అన్నది గ్లోరీ—కర్చీఫ్‌తో అమృతమూర్తి కన్ను లద్దుతూ.

"నోరు తెరవండి! ఈ ఒక్క బిళ్ళ గుటుక్కున మింగండి! హాయిగా నిద్ర పోండి!" అన్నది గ్లోరీ.

అమృతమూర్తి కళ్ళు మూసుకున్నాడు.

రవుండ్స్ పూర్తి చేసి వెడుతూ వెడుతూ డాక్టర్ మరోసారి అమృతమూర్తిని చూశాడు.

"మేము లాభం లేదనుకున్నాము కాని, బయట పడ్డాడు" అన్నాడు డాక్టరు.

"యస్సార్" అన్నది గ్లోరీ.

"అయినా కనిపెట్టి ఉండు."

"యస్సార్" అన్నది గ్లోరీ.

• • • •

నటి: డాక్టర్ మాటలు విన్నాడు.

సూత్ర: వినడం కోసమనే అతనూ అన్నాడు.

నటి: అమృతమూర్తి బయట పడ్డాడా?

సూత్ర: బయట పడింది, లేనిది నేను చెప్పడం దేనికి! అతన్నే అడగరాదా? అతనేం చెబుతాడో వినరాదా?

నటి: అతనేదో అంటున్నట్టు పెదవులు కదులుతున్నాయి.

సూత్ర: అవి వినమనే నేనూ చెబుతూంట.

నటి: ఇది ఏ రంగం?


సూత్ర: ఇప్పటి దాకా 'బహిరంగం'. ఈ క్షణం నించీ అంతరంగం.

• • • •

అమృతమూర్తి ఒకసారి కళ్ళింత చేసుకుని చూశాడు. చూసినా అతనికేమీ బోధ పడలేదు. బోధ పరుచు కునేందుకు ప్రయత్నాలారంభించాడు.

సన్నగా నిట్టూర్చాడు. ఇంకా సన్నగా గొంతు విప్పాడు.

"నీ పేరేమిటో నాకు తెలియడం లేదు: నిన్నెప్పుడూ నేను చూడలేదు. ఎంత అందంగా నీవున్నావో ఎలా చెప్పడం? లేత నీలంగా ఉన్నావు. లేతనీలం లోంచి చిగురాకు పచ్చదనం లోకి మారుతున్నావు. మారుతూ మారుతూ నవ్వుతున్నావు. నీ నవ్వు హాయిగా ఉంది. నీ నవ్వు తీయగా ఉంది. మంచు ముసుగును అలాగా సుతారంగా ఒత్తిగించి, తల లెత్తి చూస్తున్న కాంతికిరణం లాగా ఉన్నావు. ఇప్పుడే విరిసిన ఇంద్ర ధనుస్సు లాగా ఉన్నావు. అదమరిచి నిదురించే పసి నిసుగు చిన్నారి పెదవుల మీద అప్సరాంగన లద్దిన చిరునవ్వు మొలక లాగా ఉన్నావు. వెన్నెలవాకలాగా ఉన్నావు. మహాకవి అంతరాంతరాల్లో మెదిలే సద్భావ రేఖ లాగా ఉన్నావు. హోమాగ్ని శిఖలాగా ఉన్నావు. వెండి పుప్పొడి లాగా ఉన్నావు. మేలిమి వానలాగా ఉన్నావు. మహాయోగి ప్రశాంత చిత్తంలాగా ఉన్నావు. సత్యం లాగా ఉన్నావు. మహాస్వప్నం లాగా ఉన్నావు. ఆత్మజ్యోతిలాగా ఉన్నావు. అమృత కలశం లాగా ఉన్నావు. లోయలోంచి తలెత్తి చూసే వసంత సమీరంలాగా ఉన్నావు. శిశువులాగా ఉన్నావు. చిన్మయానందం లాగా ఉన్నావు. కరుణ లాగా ఉన్నావు. సత్కార్యం లాగా ఉన్నావు. పుణ్యంలాగా ఉన్నావు.




జ్ఞానంలాగా ఉన్నావు. ప్రాతస్సంధ్యాదేవి ఆలపించే ఉషోగీతికలాగా ఉన్నావు. నిశ్శబ్దం లాగా ఉన్నావు. విరువెత్తు నవ్వులాగా ఉన్నావు. దివ్య పరిమళ వీచికలాగా ఉన్నావు. అన్నీ అయినట్టుగా ఉన్నావు. ఏమీ కానట్టుగా ఉన్నావు. అంతా తెలిసి నట్టుగా ఉన్నావు. ఏమీ తెలియనట్టుగా ఉన్నావు. సచ్చిదానందం లాగా ఉన్నావు. చెల్లిలాగా ఉన్నావు. వీటన్నిటినీ మించి నా తల్లిలాగా ఉన్నావు. ఎవరు? ఎవరు? మీ రెవరు?" అన్నాడు అమృతమూర్తి.

"నన్ను వివేకానందం గారు పంపించారు."

"ఎందుకు?" అన్నాడు అమృతమూర్తి.

"తను చెప్పడం మరిచిపోయిన సంగతులు మీతో చెప్పమన్నాడు."

"ఏమి టా సంగతులు?" అన్నాడు అమృత మూర్తి కనుబొమ్మ లెగరేస్తూ.

"ఈ చరాచర జగత్తులో ఏదీ శాశ్వతం కాదు. ఏదీ నిత్యం కాదు. ప్రతిదీ ఏదో ఒక నాటికి నశించ వలసిందే! రూపు మాసి పోవలసిందే. ఇలా పోవడాన్నే 'మృతి చెందడం' అంటున్నారు. జీవించే అర్హత ఉన్నవారికే మరణించే అర్హతకూడా ఉంటుంది. జీవితం అందరినీ సమంగా చూస్తుంది. సర్వోత్తము లైనవారిని మృత్యువు ఎత్తి చూపెడుతుంది. మరణం ఒక నికషోపలం వంటిది. మంచి చెడ్డల తారతమ్యాన్ని మరణం ఇట్టే తేల్చి పారేస్తుంది. మరణమంటే మానవు లందరూ భయపడతారు. సమస్త ప్రాణి కోటీ భయపడుతుంది. మరణానంతరం ఇప్పటి కన్నా మంచి జీవితం ఉంటుందంటే నమ్మలేక పోతున్నారు. అలా ఉంటుందని వీరికి తెలియనుకూడా తెలియదు. నిజానికి, మృత్యువు భయంకరమయిందేదేమీ కాదు. అదొక సహజ పరిణామం. కాని అసహజ మైన జీవితం మృత్యువును భయంకరంగా చిత్రించింది. మృత్యువు ద్వారా లభించే పరమానందాన్ని మానవులకు తెలియకుండా భగవంతుడు దాచి ఉంచాడు. ప్రతి జీవీ ఏదో ఒక క్షణాన మృత్యుసన్నిధిని చేరుకోక తప్పదు. తప్పదనీ తెలుసు. తెలిసినా తప్పుకోవడానికి ప్రయత్నించడం కన్నా హాస్యాస్పదం వేరే ఏముంటుంది? ఎందరెందరో బంధువులు, మిత్రులు, హితులు నీ ఇంటి కొచ్చినప్పుడు సంతోషంతో స్వాగతం చెబుతావు. అలాగే మృత్యువునుకూడా నీ మిత్రుని లాగా ఎందుకు చూడలేకపోతున్నావు? ఎందుకు స్వాగతం చెప్పలేక పోతున్నావు? ఏదో ఒక నిర్దేశిత క్షణాన మిత్రుని లాగానో, హితునిలాగానో బంధువు లాగానో, అతిథి లాగానో, ఆఖరుకు నీ శత్రువు లాగానో మృత్యువు నీ ఇంటికి రాక తప్పదు. మృత్యువు ఏ రూపంలో నీ ఇంటికి రావలసినదీ— మృత్యువు పట్ల నీ వవలంబించే దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది. మృత్యువు నీకు బంధువు, నీకు హితుడు, నీకు స్నేహితుడు అనంత త్వమనే మహా సౌధంలో ప్రవేశించేందుకు వున్న వాకిలి వంటిది మృత్యువు. భగవంతుని సంసేవనంలో నిన్ను నిమగ్నం చేయడానికి మృత్యు భయాన్ని మించిన హెచ్చరిక మరొక్కటేదీ లేదు. మరణం తుది నిద్ర కానేకాదు. అది తొట్ట తొలి మేలుకొలుపు."

అమృతమూర్తి ఒకసారి చుట్టూ చూశాడు.

"ఇది తుమ్మ లాగాలేదు. మహస్సులాగామా లేదు. విచిత్రమైన మూగకాంతితో ఈ పరిసరాలన్నీ కొత్త అందాలతో కనపడుతున్నాయి. వాయువు నిండా పిచ్చుకల సంరంభాలు వినపడుతున్నాయి. నా కిప్పుడు ఎంత హాయిగా ఉన్నదని! నా కిప్పుడు ఎంత ఆనందంగా ఉన్నదని! మోయలేనంత బరువును చిరకాలంగా మోస్తూ మోస్తూ ఆ బరువును గమ్యస్థానం చేర్చేశాక, చేర్చి దించుకున్నాక ప్రాణం ఎలా కిలారిస్తుందో, ఎలా తేలిక పడుతుందో సరిగ్గా అలా ఉంది నా కిప్పుడు. బరువు కిందా, ఒత్తిడికిందా నలిగి నలిగి ఒక్కసారి బయట పడినట్టుగా ఉంది. ఇంతకాలం బందీ నుంచి విడుదలయినట్టుగా ఉంది. సముద్రం అట్టడుగున నుంచి పైకి దూసుకొచ్చినట్టుగ ఉంది. కొత్తగా రెక్క లొచ్చినట్టుగా ఉంది. ఎక్కడెక్కడికో ఎగిసి పోతున్నట్టుగా ఉంది. ఇంత కాలం నన్ను నేనే వెదుక్కుంటూ ఇప్పుడే నన్ను నేనే గుర్తించినట్టుగా ఉంది. నాకు నేనై విస్తరిస్తున్నట్టుగా ఉంది. నా నుంచి నా చుట్టూ ఉన్న అనంత త్వంలోకి ప్రసరిస్తున్నట్టుగా ఉంది. అంతా నేనేయయినట్టుగా ఉంది. నీ రాకతో, నీ స్పర్శతో, నా దయామయీ! ఇన్నిటికీ నీ పేరేమిటి?" అన్నాడు అమృతమూర్తి.

"మృత్యువు."

● ● ● ●

"ఎంత ప్రయత్నిస్తే మాత్రమేం? లాభం లేకపోయింది!" అన్నాడు డాక్టరు విచారంగా. అమృత మూర్తి నేపు చూస్తూ.

దుప్పటి తల మీదుగా లాగి కళ్ళు తుడుచుకుంది సిస్టర్ గ్లోరి.

● ● ●

సూత్ర: నజాయతే మ్రియతేవా కదాచిన్నాయం భూత్వా
భవితా వా న భూయః అజో నిత్యశ్శాశ్వతో యంపురాణో
హన్యతే హన్యమానే శరీరే!

(జన్మ మొందదాత్మ చావం డొకపుడైన
పుట్టి మరల లేకపోవడెపుడు
అత్మయుండు, నిత్యుడజుడు పురాణుండు హత
శరీరుడయ్యు, హతుడుగాడు)

నా సతో విద్యతే భావో
నా భావో విద్యతే సతః
ఉభయోరపి దృష్టో న్త
స్త్వనయో స్తత్త్వదర్శిభిః

(సత్తు గనుక జీవునకు నాశంబు లేదు
ఉనికి లేదసత్తుగు దేహమునకు పార్థ
నిశ్చయస్థితి నీ రెంటి నిర్ణయంబు
తత్త్వ విదులైన వారికే ద్రష్టమగును)

---

మొదటిది భగవద్గీతలోని 20వ శ్లోకానికి రెండవది 16వ శ్లోకానికి బచ్చు పాపయ్య శ్రేష్ఠిగారి అనువాదం.

---

నటి: ఇది చరమాంక మనుకొంటున్నాను.

సూత్ర: నిజమే! ఇప్పటి కిది చరమాంకమే కానీ, అప్పుడే మరో చోట నాందీ ప్రస్తావన జరిగిపోయింది!

అవ్యక్తా దీని భూతాని
వ్యక్త మధ్యాని భారత
అవ్యక్త నిధనా న్యేవ
తత్రకా పరిదేవనా!

(వ్యక్తములు కావు భూత సంభవము లెల్ల
వ్యక్త పడునట్లె వాని యంత్యములునట్లె
మధ్యములు మాత్ర మరపడు మహిని గాన
భూతముల కీవు శోకంబు పొందనేల?)

---

భగవద్గీతలోని 28వ శ్లోకానికి బచ్చు పాపయ్య శ్రేష్ఠిగారి అనువాదం.

---

నటి: మనం నిష్క్రమించుదామా?

సూత్ర: ఇక్కడి నుంచి వెళిపోదాం! మరోచోట కొత్తదాన్ని ప్రారంభించుదాం!

గమనిక: ఈ రచనలో మృత్యువు వెలిబుచ్చిన భావాలు: షెర్లాక్, ట్రయాన్ ఎడ్వర్డ్స్, ఫుల్లర్, బూకాప్, క్వారెల్స్, మిల్టన్, లాంగ్‌ఫెలో, రిచ్‌టర్, వాల్టర్ స్కాట్ వంటి సారస్వత మూర్తుల రచనల నుండి తీసుకున్నాను.

[సమాప్తం]